### ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయ్యిందని..

## ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం



ఆత్మహత్య చేసుకున్న శాంతికుమారి (ఫైల్‌ఫోటో)

గచ్చిబౌలి, మే 10 ప్రభాతవార్త : పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మన స్థాపానికి గురైన ఓ ఇంటర్మీడియట్ విద్యార్థిని తాను నివాసం ఉంటున్న భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. మధురానగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని తాజాగా విడుదలైన ఫలితాల్లో ఫెయిల్ కావడంతో మనస్థాపానికి గురై తనువు చాలించింది. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఈస్ట్ గోదావరి జిల్లా రాజమండ్రీ కొత్తపేటకు చెందిన నాగేంద్రరావు నగరానికి వలస వచ్చి భార్య దుర్గ, ఇద్దరు కుమార్తెలు అనుషాకుమారీ, శాంతి కుమారీలతో కలిసి మణికొండ కెపిఆర్ కాలనీలోని ఎజెఆర్ ఆర్కేడ్‌లో నివాసం ఉంటున్నాడు. పెద్దకుమార్తె అనుషాకుమారీ డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతుండగా, చిన్న కుమార్తె శాంతికుమారీ(16) మధురానగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతుంది. నాగేంద్రరావు, దుర్గ దంపతులు స్థానికంగా ఇళ్లలో పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కాగా మంగళవారం విడుదలైన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాల్లో శాంతికుమారీ 3 సబ్జెక్టులలో ఫెయిల్ అయ్యింది. ఉదయం 11 గంటల ప్రాంతంలో పనికి వెళ్లిన తండ్రి నాగేంద్రరావు ఇంటికి వచ్చి తన భార్య దుర్గను పని ప్రదేశం నుంచి తీసుకువచ్చేందుకు మరోసారి బయటకు వెళ్లాడు. కాగా అప్పటికే ఫలితాలు చూసుకున్న శాంతి కుమారీ పేయిల్ అయిన విషయం తల్లిదండ్రులకు చెప్పేందుకు బయపడింది. మరోవైపు తల్లిదండ్రులు మద్యాహ్నం సమయంలో ఇంటికి వచ్చిన వెంటనే తాము నివాసం ఉంటున్న భవనం మీదకు వెళ్లిన శాంతికుమారీ అక్కడి నుంచి కిందకు దూకింది. బయట చప్పుడు కావడంతో ఇంటి నుంచి బయటకు వచ్చిన నాగేంద్రరావు, దుర్గలకు రక్తపు మడుగులో శాంతికుమారీ కనిపించింది. దీంతో వెంటనే స్థానికుల సహాయంతో శాంతికుమారిని గచ్చిబౌలి కేర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి గాంధీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో మృతిచెందింది. ఈమేరకు సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## పదోతరగతి ఫలితాల్లో బాలికలదే పైచేయి

**28వ స్థానానికి పరిమితమైన హైదరాబాద్ జిల్లా**

**14వస్థానంలో మేడ్చల్, 20వ స్థానంలో రంగారెడ్డి**

హైదరాబాద్, మే 10,ప్రభాతవార్త: పదవ తరగతి ఫలితాల్లో బాలికలు సత్తాచాటారు. గతేడాదికంటే మెరుగైన ఉత్తీర్ణత సాధించారు. పలు ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రైవేట్ విద్యార్థులతో పోటీపడి నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించి విజయదుందుభి మోగించారు. 2022-23 విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 2నుంచి 13వరకు వార్షిక పరీక్షలను నిర్వహించారు. అయితే కరోనా ముందు హిందీ మినహా ప్రతి సబ్జెక్టుకు రెండు పేపర్ల చొప్పున పరీక్షలు నిర్వహించారు. కరోనా తాకిడితో 11పేపర్లను ఆరింటిం టికి కుదించి నిర్వహిస్తున్నారు. కాగా ఈఏడాది హైదరాబాద్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి 68,468మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అలాగే మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 43,319 మంది, రంగారెడ్డి జిల్లా నుంచి 47,551 మంది పరీక్ష రాశారు. అయితే మొత్తం 100మార్కుల్లో 80మార్కులకు మాత్రమే లిఖిత పూర్వక పరీక్షలు నిర్వహించగా.. 20మార్కుల ఇంటర్నల్ కింద ఇస్తున్నారు. ఈతరుణంలో తాజాగా వెలుబడిన ఫలితాల్లో నగర శివారు జిల్లాలైన మేడ్చల్ రంగారెడ్డి ఉత్తీర్ణత శాతం పెరిగినప్పటికీ, రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మరోసారి వెనకబడిపోవడం చర్చనీయాంశంగా మారింది.

### యూ టర్న్ పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలి

చిక్కడపల్లి, మే 10 ప్రభాతవార్త: ఆర్టీసిక్రాస్‌రోడ్స్ నుంచి అశోక్‌నగర్ వరకు నిర్మాణం జరుగుతున్న స్టీల్‌బ్రిడ్జ్ నిర్మాణం అనంతరం దుఖాణాదారులు, వ్యాపారస్తులు, స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 'యూ టర్న్', పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని స్థానిక వ్యాపారస్తులు గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్‌కు వినతిపత్రాన్ని బుధవారం సమర్పించారు. ఈ సందర్భంగా చిక్కడపల్లి ట్రాఫిక్ సిఐ నానూనాయక్, ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోపాల్, బిజెపి నగర నాయకులతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. త్వరలోనే పనులు చేపట్టాలని కోరారు. యూ టర్న్ సమస్యలను సమీక్షించి ట్రాఫిక్ చిక్కులు ఏర్పడకుండా పనులు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జవహర్‌నగర్ వ్యాపారస్తులు సింగారపు రమేశ్, నగేశ్, రమేశ్‌జైన్, మోజిత్, మహావీర్, బిజెపి డివిజన్ అధ్యక్షుడు రత్నాసాయిచంద్, బిజెపి నేతలు శ్రీకాంత్, పి.నర్సింగరావు, శివకుమార్, సంయుక్తరాణి తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ వార్త

# నచ్చినోళ్లకే.. కాంట్రాక్టులు

**విద్యుత్‌శాఖలో ఇష్టారాజ్యంగా అధికారుల తీరు**

**తమబంధుల పేర్లతో ప్రైవేట్ కాంట్రాక్ట్ లైసెన్స్‌లు**

**పలుప్రాంతాల్లో టెండర్లు లేకుండానే పనులు**

**అధికారుల తీరుపట్ల సర్వత్రా విమర్శల వెల్లువ**





హైదరాబాద్, మే 10,ప్రభాతవార్త: విద్యుత్‌శాఖలో కొందరు అధికారుల తీరుపట్ల తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. టెండర్ల ద్వారా పనులు కేటాయించాల్సి ఉంటే వాటిని రెండుమూడు పనులుగా విభజిస్తూ తమకు నచ్చివారికే వాటిని అప్పగిస్తున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. షిఫ్టింగ్ మొదలు కొత్త లైన్లు వేయడం, సబ్‌స్టేషన్ నిర్మాణం వంటి పనుల వరకు తమకు సంబంధించిన కాంట్రాక్టర్లకే అప్పగిస్తూ పలు సర్కిళ్లలోని అధికారులు భారీగా అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తుంది. ఇంకా కొంతమంది ఆఫీసర్లు తమ బంధుల పేర్లతో ప్రైవేట్ కాంట్రాక్ట్ లైసెన్స్‌లు తీసుకుని వారికే పనులు అప్పజెప్పుతూ రెండు చేతులా అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా అక్రమాలకు పాల్పడుతున్న పలువురు అధికారులు ఏసిబికి చిక్కుతున్నా కొద్దినెలల్లో తిరిగి ఉద్యోగాల్లో చేరి విద్యుత్ సంస్థల్లోని కొన్ని అసోసియేషన్లు, యూనియన్ల అండదండలతో నచ్చిన ప్రాంతాల్లో పోస్టింగ్‌లు తెచ్చుకుంటూ తిరిగి మళ్ళీ అక్రమాలకు పాల్పడుతన్నారు. ముఖ్యంగా అండర్‌గ్రౌండ్ కేబుల్ పనుల్లో విద్యుత్‌శాఖ వాటి నాణ్యతను పట్టించుకోవడం లేదు. కేబుల్ వేసిన మార్గంలో ఇతర కేబుల్లో వేయరాదనే నిబంధనలు ఉన్నప్పటికీ కొంతమంది అధికారులు ప్రైవేట్ కంపెనీలతో పాటు ఆస్పత్రులకు ఇచ్చే హెచ్‌టి కనెక్షన్లలైన్లు అవే మార్గాల్లో వేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అండర్‌గ్రౌండ్ కేబుల్ పనులకు కేవలం 5-6 కంపెనీలకు మాత్రమే అప్పగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నాణ్యత లేకుండా అండర్ గ్రౌండ్ కేబుళ్లు వేస్తున్న ప్రాంతల్లో భవిష్యత్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదాలు జరిగితే ప్రాణ, ఆస్తినష్టం జరిగే అవకాశముందని విద్యుత్ రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. క్షేత్రస్థాయిలో చేపడుతున్న పనులపై ఆర్నెళ్లకోసారి ఆడిట్ చేపడితే అక్రమాలకు చెక్ పెట్టవచ్చునని సీనియర్ రిటైర్డ్ అధికారులు సూచిస్తున్నారు.

**అధికారులకు గాడ్ ఫాదర్ల అండదండలు..** విద్యుత్‌శాఖలోని వివిధ సర్కిళ్లలో, కాంట్రాక్టులు, కనెక్షన్ల విషయంలో అక్రమాలకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులు ప్రధాన కార్యాలయానికి వచ్చినా గాడ్ ఫాదర్ల అండదండలతో విచారణ లేకుండానే తప్పించుకుంటున్నారు. చెరువులు, కుంటలు, ఎఫ్‌టిఎల్ ప్రాంతాల్లో అక్రమంగా వెలుస్తున్న నిర్మాణాలకు నకిలీపత్రాలతో విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నారు. పలు ప్రాంతాల్లో లోడ్ పెరిగిందని చెబుతూ టిఎస్‌ఎస్‌పిడిసిఎల్ ఖర్చులతో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తూ సంస్థ ఆదాయానికి గండికొడుతున్నారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్‌పార్మర్ల కేటాయింపుల్లో అక్రమాలు జరుగుతున్నా ఉన్నతాధికారులు మాత్రం తమ దృష్టికి రాలేదంటూ తప్పించుకుంటున్నారు. విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో నిజమని తేలినా కిందిస్థాయి సిబ్బంది బాధ్యులుగా చూపుతూ వారిపై చర్యలు తీసుకుంటూ సూత్రదారులు తప్పించుకుంటున్నారు.

# ఉద్యోగాల భర్తీకి కారుణ్య నియామకాలు చేపట్టాలి

**సాదాసీదాగా జరిగిన కంటోన్మెంట్ బోర్డు పాలకమండలి సమావేశం ● ఏజెండాలపై కీలక నిర్ణయాలు తీసుకున్న బోర్డు**

కంటోన్మెంట్, మే 10 ప్రభాతవార్త: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డులో పని చేసిన ఉద్యోగులు సర్వీస్‌లో ఉంటూ అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాల భర్తీకి కారుణ్య నియామకాలు చేపట్టాలని, రక్షణ శాఖ స్థలాల్లో సంవత్సరాల తరబడి నివాసం ఉంటున్న నిరుపేదలకు ప్రత్యామ్నాయ స్థలాలు కెటాయించి ఇండ్లస్థలాలు, డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని పాలక మండలి కమిటీ తీర్మాణించింది. బుధవారం కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ కె.ఎసోమశంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మల్కాజిగిరి పార్లమెంట్ ఏ.రేవంత్ రెడ్డి, సిఈఓ మధుకర్ నాయక్, సివిలియన్ నామినేటెడ్ మెంబర్ జె.రామక్రిష్ణ సమక్షంలో వివిధ అంశాలపై చర్చించి ఆమోదం తెలిపారు. కంటోన్మెంట్ బోర్డులో పని చేసిన ఉద్యోగులు సర్వీస్‌లో ఉండి అనారోగ్యంతో మృతి చెందిన వారి పిల్లలకు ఉద్యోగ అవకాశం కల్పించేందుకు కారున్య నియామకాలపై బోర్డు సానుకూలంగా స్పందించారు. నాలాల సమస్యలను పరిష్కరించేందుకు, శాశ్వత మరమ్మతులు చేపట్టేందుకు బోర్డు నిర్ణయించింది. కంటోన్మెంట్ బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల విడుదలపై చర్చించారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే దివంగత సాయన్న, మాజీ ఎంపీ నంది ఎల్లయ్యల విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు బోర్డు అమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వం నుంచి కంటోన్మెంట్ బోర్డుకు రావాల్సిన బకాయిలపై రక్షణ శాఖ మంత్రితో చర్చించి నిధుల విడుదలకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. బొల్లారం ఆసుపత్రి ఆధునీకరణకు, ఉమెన్స్‌హాస్టల్ ఏర్పాటు చేయుటకు బోర్డు నిర్ణయించింది. ఆర్మీ ఏరియాలో మూసి వేసిన రోడ్లను తిరిగి ఓపెన్ చేయాలని బోర్డు నిర్ణయించింది. బోయిన్‌పల్లి ఫైజన్ స్కూల్ వద్ద మూసి వేసిన రోడ్డును ఓపెన్ చేయాలని, ఆ ప్రాంతంలోని రోడ్లను మరింత అభివృద్ధి చేసేందుకు నిర్ణయించారు. రక్షణ శాఖ స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న నిరుపేదలకు మట్‌పోర్ట్ అంబేద్కర్ నగర్, 108 బజార్,సాయిబాబా హట్స్‌వంటి బస్తీల్లో నివాసం ఉంటున్న నిరుపేదలకు భూ బదలాయింపు కింది ఇండ్ల స్థలాలు ఏర్పాటు చేయాలని బోర్డు నిర్ణయించింది. ఈ అంశంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని నిర్ణయించారు. బోయిన్‌పల్లి చెక్ పోస్టు నుంచి సుచిత్రకు వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో ఉన్న 10 ఎకరాల స్థలంలో రాజీవ్ గాంధీ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌కు భవన నిర్మాణం చేపట్టేందుకు కూడా ఆమోదం తెలిపింది.





కంటోన్మెంట్ బోర్డు పాలక మండలి సమావేశంలో బ్రిగేడియర్ సోమ శంకర్, ఎంపీ రేవంత్ రెడ్డి, సిఈఓ మధుకర్ నాయక్, బోర్డు సభ్యుడు రామక్రిష్ణ తదితరులు

## ఒయుతో పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న సింగరేణి

తార్నాక, మే 10 ప్రభాతవార్త: ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మైనింగ్ విభాగంలో సింగరేణి కాలరీస్ రెండు ప్రతిష్టాత్మక నిర్ణయాలు తీసుకుంది.సింగరేణీ కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌తో పరస్పర ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వార ఓ.యూ ఇంజనీరింగ్ కళాశాల మైనింగ్ విభాగంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ చైర్ ఏర్పాటు చేసింది. ఫలితంగా మౌలిక వసతులు, అధ్యాపకుల కొరతను తీర్చేందుకు అవసరమైన నిధులు సమకురనున్నాయి. ఎంఓయూలో భాగంగా సింగరేణీ సీఎండి ఎన్.శ్రీధర్ రూ. 3 కోట్ల గ్రాంట్‌ను ఓ.యూ వైస్ చాన్స్‌లర్ రవీందర్ యాదవ్‌కు అందించారు. రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో మొదటి సారిగా మైనింగ్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసేందుకు ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ కింద ఇద్దరు సింరేణి ఉద్యోగులకు ఉత్తర్వ్యులు ఇచ్చింది.ఈ మేరకు సింరేణి సీఎండీ ఎన్.శ్రీధర్,ఓ.యూ విసి రవీందర్ యాదవ్ నేతృత్వంలో సింగరేణీ ఉద్యోగులు సతీష్, శ్రీనివాస్‌కు ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీకి కింద ఉత్తర్వ్యులను అందజేశారు. ఈసందర్భంగా సింగరేణి కాలరీస్ సీఎండీ ఎన్.శ్రీధర్ మాట్లాడుతూ ఎంతో మంది మహానుబావులను అందించిన ఓ.యూకు కార్పోరేట్ సషల్ రెస్పాన్సిబిలిటి కింద సహకారాన్ని అందించడం ఆనందంగా ఉందన్నారు. తాను ఈ స్థాయిలో ఉండటానికి ఓ.యూనే కారణం అన్నారు. వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఓ.యూ జాతీయ,ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయంగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. రూ. 1100 వందల కోట్ల టర్నోవర్ ఉన్న సింగరేణి నేడు రూ. 32వేల కోట్ల టర్నోవర్‌కు పెంచిన ఘనత సీఎండీ శ్రీధర్‌దే అని కొనియాడారు. ఓ.యూకు ఆయన సహాకారం అందించడం సంతోషంగా ఉందని ఆయనకు కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.పి.లక్ష్మినారాయణ, ఇంజనీరింగ్ అలుమ్నీ అసోషియేషన్ అధ్యక్షుడు విజయ్ దేవరకొండ, ఉపాధ్యక్షుడు అమర్‌నాథ్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరాం వెంకటేష్‌తో పాటు పరిశోధనా విద్యార్థులు పాల్గొన్నారు.



పరస్పర ఒప్పంద పత్రాలను తీసుకుంటున్న విసి ప్రొ.రవీందర్ యాదవ్, సింగరేణి ఎండి శ్రీధర్

## విద్యార్థులు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి

**జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ ముకుందరెడ్డి**





పోటీల్లో విజేతలకు బహుమతులు అందించిన ముకుందరెడ్డి తదితరులు

బేగంపేట మే 10,ప్రభాతవార్త : విద్యార్థులు కేవలం విద్యకే పరిమితం కాకుండా తమకు ఇష్టం వచ్చిన క్రీడలలో రాణించాలని జీహెచ్‌ఎంసీ బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమీషనర్ ముకుంద్‌రెడ్డి సూచించారు.నగరంలోని జీహెచ్‌ఎంసీ వేసవి శిక్షణా శిబిరాల్లో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులకు బుధవారం సికింద్రాబాద్ ఎస్పీరోడ్‌లోని స్విమ్మింగ్ పూల్ వద్ద స్పోర్ట్స్ క్విజ్‌ను నిర్వహంచారు.ఈ సందర్భంగా క్రీడలకు సంబంధించిన ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు.ఈ పోటీల్లో విజయం సాధించిన వారికి సర్కిల్ 16 డిప్యూటి కమిషనర్ వేణుగోపాల్, గేమ్స్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్‌గౌడ్, బాక్సింగ్ కోచ్ కృష్ణ లతో కలసి ముకుందరెడ్డి బహుమతులు అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉండే ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నామని అన్నారు.ఇక్కడ శిక్షణ పొందిన ఎంతో మంది ఆయా క్రీడల్లో ఉన్నతంగా రాణిస్తున్నారని,గుర్తు చేసారు.తల్లి దండ్రులు తమ పిల్లలను విద్యకే పరిమితం చేస్తూ ఒత్తిడికి గురి చేస్తున్నారని,క్రీడల్లో వారికి శిక్షణ అందించాలని సూచించారు.క్రీడలతో కూడా మంచి భవిష్యత్ ఉంటుందని,దేశానికి పేరు తేవడంలో క్రీడాకారుల పత్ర ఎంతో ఉందని చెప్పారు.క్విజ్‌లో మొదటి బహుమతి షీమా సుల్తానా,ఎండి అహిల్, ద్వితీయ బహుమతి వర్ష, అంబికా, తృతీయ బహుమతి అఖిబ్, రిషికేష్‌లు దక్కించుకున్నారు.

### ఫలక్‌నుమా ఏసిపి షేక్ జహంగీర్‌కు రాష్ట్ర ఉత్తమ సేవా పతకం

చార్మినార్,మే 10 ప్రభాతవార్త : విధి నిర్వాహణలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన హైదరాబాద్ పాతబస్తీ ఫలక్‌నుమా ఎసిపి షేక్ జహంగీర్‌కు బుధవారం రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ తెలంగాణ రాష్ట్ర ఉత్తమ సేవా పతకం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ సేవా పతకం అందుకున్న ఫలక్ నుమా ఏసిపి షేక్ జహంగీర్ మాట్లాడుతూ రాష్ట్ర ఉత్తమ సేవా పతకం లభించటం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. రాష్ట్ర ఉత్తమ సేవా పతకం అందుకున్న ఏసిపి షేక్ జహంగీర్‌ను పాతబస్తీకి చెందిన పలువురు ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది అభినందించారు.





హోంశాఖ మంత్రి మహమూద్ అలీ ఫలక్‌నుమా ఏసిపి షేక్ జహంగీర్‌కు రాష్ట్ర ఉత్తమ సేవా పతకం ప్రధానం చేస్తున్న దృశ్యం



అడ్డగుట్టలో కల్యాణ లక్ష్మీ చెక్కులను అందజేస్తున్న పద్మారావు గౌడ్ తదితరులు

## కెసిఆర్ పథకాలు దేశంలోనే ఆదర్శం

**అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్**

అడ్డగుట్ట, మే 10 ప్రభాతవార్త: పేదలకు ఉపశమనం కలిగించేలా కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ పథకాల అమలుతో ఆడపిల్లల తల్లిదండ్రులకు ఎంతో మేలు జరుగుతుందని అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ తెలిపారు. బుధవారం అడ్డగుట్ట డివిజన్‌లో నివాసం ఉంటున్న 49 మందికి మంజూరైన కలాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను అడ్డగుట్ట డివిజన్ కార్పోరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్, బిఆర్ఎస్ యువనేత రామేశ్వర్ గౌడ్, గ్రంథాలయడైరెక్టర్ లింగాని శ్రీనివాస్‌లతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ సికింద్రాబాద్ అసెంబ్లీ ఆదర్శ నియోజకవర్గంగా నిలిచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదే విధంగా ఆసియా అతి పెద్ద మురికివాడగా పేరొందిన అడ్డగుట్ట రూపురేకలను మార్చామన్నారు. తుకారాంగేట్‌లో ఆర్‌యూబీ నిర్మించడంతో చిరకాల స్వప్నాన్ని నెరవేర్చామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శివకుమార్, బిఆర్ఎస్ నాయకులు కైరం కొండ యాదగిరి, మధుగౌడ్, వసంత, ఎండి ఇస్మాయిల్, ప్రవీణ్, శ్రీరామ్ నాయక్, మల్లేశ్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉదయం ఎండ.. సాయంత్రం కుండపోత

**నగరంలోని పలుచోట్ల భారీ వర్షం**



హైదరాబాద్,మే 10,ప్రభాతవార్త: నగరంలో పలు ప్రాంతాల్లో బుధవారం భారీ వర్షం పడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మండుటెండలు నగర వాసులకు చుక్కలు చూపించగా ..సాయంత్రానికి వాతావరణం చల్లబడింది. ఉప్పల్,రామాంతపూర్, బోడుప్పల్ ,పీర్జాదిగూడ, ఘట్‌కేసర్ ,పోచారం తదితర ప్రాంతాల్లో రహదారులు చెరువులను తలపించాయి. కాలనీల్లో ముంచెత్తిన వరదనీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచింది. ఉప్పల్ చౌరస్తా నుంచి వరంగల్ ప్రధాన రహదిరిపై భారీ వరదనీరు వచ్చి చేరడంతో రాకపోకలు సాగించేఆవరు ఇబ్బందులు పడ్డారు. ఘట్‌కేసర్ -కీసర మార్గంలో చెట్లు నేలకొరగడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

### త్యాగరాయ గానసభ

## కళాకారులకు పవిత్ర ఆలయం

**రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ దేవీప్రసాద్**



సాంస్కృతిరంగ సేవా పురస్కారాన్ని వైఎస్ఆర్ మూర్తికి అందించిన దృశ్యం

చిక్కడపల్లి, మే 10 ప్రభాతవార్త: త్యాగరాయ గానసభ కళాకారులకు పవిత్ర ఆలయం అని, ఈ వేదికపై ప్రదర్శనలిచ్చి తదనంతర కాలంలో ప్రఖ్యాతి పొందారని రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ దేవీప్రసాద్ అన్నారు. బుధవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన గానసభ నిర్వహణలో మూడు రోజుల పాటు జరిగే గానసభ వ్యవస్థాపకులు కళాసుబ్బారావు జయంతి సమావేశాలకు ముఖ్యఅతిథిగా దేవీప్రసాద్ హాజరై కళాసుబ్బారావు సాంస్కృతిరంగ సేవా పురస్కారాన్ని వైఎస్ఆర్.మూర్తికి బహుకరించి ప్రసంగించారు. ఇంటిపేరులోనే కళను నింపుకున్న సుబ్బారావు ప్రవర్ధమాన కళాకారులకు వేదిక ఉచితంగా ఇచ్చి ప్రోత్సహించారని, వారిలో చాలలా మంది నేడు కళారంగంలో ఉన్నతస్థాయిలో ఉన్నారని గుర్తు చేశారు. కళావిఎస్.జనార్ధనమూర్తి మాట్లాడుతూ వైఎస్ఆర్.మూర్తి తను మా తండ్రిగారైన కళాసుబ్బారావు గానసభ అధ్యక్షుడిగాఉన్న సమయంలో కార్యదర్శిగా ఈ ప్రాంగణం అభివృద్ధిలో పాలుపంచుకున్నారని అన్నారు. వైఎస్ఆర్.చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కళా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని, వైజ్‌మెన్ ఇంటర్నేషనల్‌లో వివిధ హోదాలలో పనిచేశారని అన్నారు. కార్యక్రమంలో గానసభ సంయుక్త కార్యదర్శి తాళ్ళపల్లి చక్రపాణి, గాయకుడు గంటి రామకృష్ణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు బాలసుష్మాదేవి, రత్నమాల శిష్యబృందం ఆధ్వర్యంలో కర్ణాటక సంగీత కార్యక్రమం జరిగింది.

## పంచలోహా విగ్రహా ప్రతిష్టాపన.. రుద్రహోమం



మోతీనగర్ శ్రీశృంగేరి శారద శంకర మఠంలో శ్రీశారదాంబ నూతన పంచలోహా విగ్రహా ప్రతిష్ట కార్యక్రమంలో శ్రీ రుద్రహోమంలో పాల్గొన్న శాకాధిపతి చివుకుల శ్రీరామచంద్రమూర్తి

యూసుఫ్‌గూడ, మే 10, ప్రభాతవార్త : మోతీనగర్ ప్రాంతంలోని శ్రీశృంగేరి జగద్గురు మహాసంస్థానం శ్రీశృంగేరి శారద శంకర మఠంలో శ్రీశారదాంబ నూతన పంచలోహా విగ్రహా ప్రతిష్ట ఆలయ చతుర్విన్ క్షతీతమ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేద పండితులచే ఉదయం నుంచే గురువందనం, గురుపాదుక పూజ, శ్రీ ఆదిశంకరాచార్యుల అష్టోత్తర శతనామార్చన, గణపతి పూజ, కలశ స్థాపన, రుత్విక్ వరణం, గోపూజ,త్రిరుద్ర హోమం, తదితర పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈవేడుకల్లో శ్రీశృంగేరి జగద్గురు మహాసంస్థానం సియిఓ, అడ్మినిస్ట్రేటర్ పద్మశ్రీ డాక్టర్ విఆర్ గౌరిశంకర్, శాకాదిపతి చివుకుల శ్రీరామ చంద్రమూర్తిలు పాల్గొన్నారు.

### కన్నులపండువగా గరుడ వాహన వాహన సేవ

చిక్కడపల్లి, మే 10 ప్రభాతవార్త: వేదపండితులు మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ కలియుగప్రత్యక్షదైవం శ్రీనివాసుడి గరుడ వాహన వాహన సేవ మహోత్సవం బుధవారం రాత్రి ఆలయం వ్యవస్థాపక వంశీయులు స్వర్గీయ గుడిదేవుని రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు, ఆలయం వంశీయుకులు గుడిదేవుని శ్రీనాథ్‌గౌడ్, ఈవో కె.రామాంజనేయుల సమక్షంలో రమణీయంగా సాగింది. ఉదయం సుప్రభాతసేవ, పుణ్యాహవాచనము, బిందెతీర్థము, బాలభోగము, బలిహరణం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామివారికి పల్లకీసేవ కార్యక్రమాన్ని శోభాయమానంగా నిర్వహించారు. మహానివేదన, హారతి, మంత్రపుష్పం కార్యక్రమం జరిగింది. అనంతరం ప్రబంధపారాయణం, మహానివేదన, హవనం, హారతి, మంత్రపుష్పం జరిగింది. అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన అలివేలుమంగా సమేత ఈ ఉత్సవాన్ని పాంచరాత్రాగమ శాస్త్రానుసారంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయం వ్యవస్థాపక వంశీయులు స్వర్గీయ గుడిదేవుని రాజేంద్రనాథ్‌గౌడ్ సతీమణి జి.సువర్ణలత, కుమారుడు జి.శ్రీనాథ్‌గౌడ్-జి.కీర్తి దంపతులు పాల్గొన్నారు.



గరుడవాహన వాహన సేవ నిర్వహించిన దృశ్యం

## కాంగ్రెస్‌తో బిఆర్ఎస్ కుమ్మక్కైంది : రామక్రిష్ణ

కంటోన్మెంట్, మే 10 ప్రభాతవార్త: రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ పేరుతో 1000 కోట్ల రూపాయల విలువ చేసే 10 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక జీవోను విడుదల చేసి క్లేరెన్స్ ఇవ్వడంతో బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటైయ్యాయని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామక్రిష్ణ తెలిపారు. బుధవారం కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రామక్రిష్ణ మాట్లాడుతూ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న రూ. 1000 కోట్లు విలువ చేసే 10 ఎకరాల స్థలంలో రాజీవ్ గాంధీ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ పేరుతో కొనసాగుతున్న స్థలంలో భవన నిర్మాణాలు చేపట్టేందుకు గతంలో జరిగిన బోర్డు పాలక మండలి సమావేశంలో తిరస్కరించడం జరిగిందన్నారు. వాటిపై జిల్లా కలెక్టర్, ఆర్‌డిఓలు కూడా ఎన్ఓసీ జారీ చేయలేదన్నారు. అయితే ఈ స్థలంలో భవన నిర్మాణాలు చేపట్టేందుకు బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని జీవో విడుదల చేసి అందులో నిర్మాణాలు సాఫీగా కొనసాగించేందుకు బిఆర్ఎస్ ప్రభుత్వం గ్రీన్ సగ్నల్ ఇచ్చిందన్నారు. అందు వల్ల వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఈ రెండు పార్టీలు ఏకం అయ్యేందుకు స్పష్టమైన ఆధారం ఉందన్నారు.

## రెండు కోట్లతో అంబర్‌పేటలో విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం

### అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


విద్యుత్ శాఖాధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కాలేరు

హైదరాబాద్, మే 10 ప్రభాతవార్త: అంబర్‌పేట నియోజవర్గంలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించాలనే లక్ష్యంతో స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రత్యేకంగా చొరవ తీసుకుని రెండు కోట్ల రూపా యల నిధులను మంజూరు చేయించ డం జరిగింది. ఈ మేరకు బుధవారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ సిఎం కెసిఆర్ అశీస్సులతో నియోజకవర్గంలో అన్ని అభివృద్ధి పనులు జరుగుతున్నాయని నేడు రెండు కోట్ల నిధులతో విద్యుత్ సంబంధిత సమస్యలను పరిష్కారం అవుతున్నాయని చెప్పారు. ఈ మేరకు నియోజకవర్గంలో చేపట్టవలసిన విద్యుత్ అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించడం జరిగిందని కొత్త విద్యుత్ లైన్‌లు వేయడం, పాత స్థంబాలను మార్చివేయడం, ట్రాన్స్‌ఫారాలు మార్పిడి తదితర పనులను చేపట్టడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖాధికారులు బ్రహ్మం, కమలాకర్, శీనయ్య, శ్రీనివాస్, ప్రసాద్, ఫృథ్వీరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వర్సిటీలను కాపాడేందుకు ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటం

### విక్కి మహేసరి


మట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి విక్కి మహేసరి

తార్నాక, మే 10 ప్రభాతవార్త: ప్రభుత్వ వర్సిటీలను కాపాడుకునేందుకు ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని, ఫీజుల పెంపునకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి విక్కి మహేసరి పేర్కొన్నారు. ఈ మేరకు ఓ.యూలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజేపీ విద్యారంగానికి కేవలం 3శాంతం కంటే ఎక్కువ నిధులను కేటాయించలేదని వర్సిటీల పట్ల పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. బీజేపీ విద్యను కాశాయికరణనే లక్ష్యంగా పనిచేస్తుందని ఆరోపించారు. దీనికి వ్యతిరేకంగా విధ్యార్థులు పోరాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిర్ణయంపై దేశవ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాలను ఏకం చేసి బిజేపీకి వ్యతిరేకంగా పోరాటాలను కొనసాగిస్తామన్నారు. ఓ.యూ వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్ విద్యార్థులను కలువడానికి కూడా సమయం ఇవ్వకుండా నియంతృత్వంగా వ్యవహరించడం మంచి పద్ధతి కాదన్నారు. ఇక్కడ ఎక్కడలేని విధంగా పీహెచ్‌డీ కోర్స్ ఫీజ్ రూ. 2000 నుంచి రూ.20వేలు చేశారని ఇది పేద విధ్యార్థులకు ఇబ్బందులు కల్గించేవిధంగా ఉందన్నారు. ఈ విషయంపై జంతర్ మంతర్ వద్ద నిరసన చేయబోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఓ.యూ కార్యదర్శి నెల్లి సత్య, నాయకులు అశోక్ స్టాలిన్, మణికంఠ రెడ్డి, పుట్టలక్ష్మణ్, గ్యార నరేష్, రహమాన్, సాయి, భగత్, లెనిన్ తధితరులు పాల్గొన్నారు.

## ఎల్‌వోసిలు అందజేసిన ఎమ్మెల్సీ


లబ్దిదారులకు ఎల్‌వోసిలు అందజేస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

దుండిగల్, మే 10 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని దుండిగల్ మున్సిపాలిటీకి చెందిన ఎం.శంకర్, జగద్గిరిగుట్టకు చెందిన జి.శంకర్, గాజులరా మారంకు చెందిన లక్ష్మీ, ప్రగతినగర్‌కు చెందిన పల్లవి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సరియైన చికిత్స చేయించుకునేందుకు ఆర్థిక సమస్యలు తలెత్తడంతో ప్రభుత్వ విప్, మేడ్చల్ బిఆర్ఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును ఆశ్రయించి తమ గోడును వెల్లబో సుకున్నారు. స్పందించిన ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి వారి చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఎం.శంకర్‌కు రూ,1లక్ష50 వేలు, జి.శంకర్‌కు రూ,2లక్షల 50వేలు, జి.లక్ష్మీకిరూ, 2లక్షల50వేలు, పల్లవికి రూ,2లక్షల 50వేలు మంజూరూ చేయించారు. బుధవారం శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో లబ్దిదారులకు ఎల్‌వోసి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, లబ్దిదారుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే


ఉర్సు ఉత్సవాల్లో ముస్లిం సోదరులతో ఎమ్మెల్యే కెపి వివేకానంద్.

నిజాంపేట్,మే10 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి జీతేపీర్ దర్గా ఉర్సు ఉత్సవాల్లో బుధవారం ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మత సామరస్యానికి ప్రతీక ఉర్సు ఉత్సవాలని ఎమ్మెల్యే కొనియాడారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి, ఫ్లోర్ లీడర్ ఆగం పాండు, కార్పొరేటర్లు విజయ లక్ష్మీ కో-ఆప్షన్ సభ్యుడు సలీం, ఎన్ఎంసీ బీఆర్ఎస్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్, పి.వి.రావుల అశయాల సాధన కోసం ఎస్సీలు రాజ్యాధికారంలోకి రావాలి

### మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య పిలుపు


పి.వి.రావు జయంతి సభలో మాట్లాడుతున్న జి.చెన్నయ్య

సైఫాబాద్, మే 10 ప్రభాతవార్త: ఎస్సీలు రాజ్యాధికారం సాధించినప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య స్పష్టం చేశారు. రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్, మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పి.వి.రావు ఎస్సీలు రాజ్యాధికారంలోకి రావాలని ఎన్నో కలలు కన్నారని వారి కలలను నిజం చేసేందుకు ఎస్సీలంతా ఐక్యంగా రాజ్యాధికార సాధనే లక్ష్యంగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం సైఫాబాద్‌లోని స్ఫూర్తి భవన్‌లో జరిగిని పి.వి.రావు 74వ జయంతి సభలో ఆయన ప్రసంగించారు. పి.వి.రావు ఎస్సీలంతా ఐక్యంగా జీవించాలని, రాజ్యాధికారంలోకి రావాలని, అభివృద్ధి చెందాలని, ఇతర డిమాండ్ల సాధన కోసం ఎంతో కృషి చేశారని ఆయన చెప్పారు. పి.వి.రావు విద్యార్థి దశ నుంచి ఆనేక ఉద్యమాలలో పాల్గొన్నారని, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అన్యాయాలపై ఎనలేని పోరాటాలు చేశారని, ఆయన జీవితమంతా పోరాటాలకే సరిపోయిందని, చివరికి ప్రాణాలను అర్పించారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పి.వి.రావు అశయాల సాధన కోసం ఎస్సీ, ఎస్టీలు కృషి చేయాలని, రాజ్యాధికారంలో ఎస్సీ,ఎస్టీలకు వాటా కల్పించాలని, ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులు, హత్యలను అడుకునేందుకు ఉద్యమించాలని చెన్నయ్య పిలుపునిచ్చారు. అంబేద్కర్, పి.వి.రావుల అశయాల సాధన కోసం మాల మహానాడు ఉద్యమాలు చేపడుతుందని స్పష్టం చేశారు. అంతకు ముందు ఆయన అంబేద్కర్, పి.వి.రావు చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సభలో మాల మహానాడు రాష్ట్ర, నగర నాయకులు పాల్గొన్నారు

## గాజులరామారం డివిజన్‌లో ఎమ్మెల్యే ప్రగతి యాత్ర


కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కెపి వివేకానంద్

జీడిమెట్ల, మే10 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ పరిధిలోని ఆర్‌కే లేఅవుట్, మిథిలా కాల నీలలో బుధవారం ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ప్రగతి యాత్రలో భాగంగా పాదయాత్ర చేసి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌కే అవుట్ పరిధిలో రూ.1.85కోట్లతో భూగర్భ డ్రైనేజీ పనులు, సుమారు రూ.2కోట్లతో మంచినీటి పైపులైన్ పనులు, రూ.1.95 కోట్లతో జరుగుతున్న పార్కు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. అదే విధంగా రూ.89లక్షలతో సీసీ రోడ్డును పూర్తి చేసినందుకు స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మిథిలానగర్ కాలనీలో రూ.2కోట్లతో సీసీ రోడ్డు, రూ.1కోటితో భూగర్భ డ్రైనేజీ పనులు, రూ.10లక్షలతో వీధి దీపాలు, రూ.1.20కోట్లతో 5 పార్కుల అభివృద్ధికి కృషి చేసిన ఎమ్మెల్యేను కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఈ రూపాదేవి, డీజీఎం అప్పలనాయుడు, ఏఈ కళ్యాణ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## పాతబస్తీ పదవ తరగతి పరీక్షలలో ఉత్తీర్ణత..

### చార్మినార్ జోన్‌లో 67, బహదూర్‌పుర జోన్‌లో 65, బండ్లగూడ జోన్‌లో 63 శాతం మంది విద్యార్థుల ఉత్తీర్ణత

చార్మినార్, మే 10 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీలోని చార్మినాన్ జోన్ పరిధిలో 67 శాతం,బహదూర్‌పుర జోన్ పరిధిలో 65 శాతం,బండ్లగూడ జోన్ పరిధిలో 63 శాతం మంది విద్యార్దులు పదవ తరగతి పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు.బండ్లగూడ జోన్ పరిధిలోని 13 ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన 531 మంది విద్యార్దులు పదివ తరగతి పరీక్షలు రాయగా వారిలో 333 మంది విద్యార్దులు ఉత్తీర్ణులయ్యారు.198 మంది విద్యార్దులు ఫెయిల్ అయ్యారని బహదూర్‌పుర జోన్ ఉప విద్యాశాఖాధికారి మహ్మద్ ము క్రం తెలిపారు.ఎక్కువ శాతం మంది విద్యార్దులు గణితం,తెలుగు సబ్జెక్టులలో ఫెయిల్ అయ్యారని ఆయన తెలియజేశారు.బహదూర్‌పుర జోన్ పరిధిలో 26 ప్రభుత్వ హైస్కూళ్లకు చెందిన 705 మంది విద్యార్దులు పరీక్షలకు హాజరు కాగా వారిలో 461 మంది విద్యార్దులు ఉత్తీర్ణులు అవ్వగా 244 మంది విద్యార్దులు ఫెయిల్ అయ్యారు. చార్మినార్ జోన్ పరిధిలోని 16 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన 435 మంది విద్యార్దులు పదివ తరగతి పరీక్షలు రాయగా 290 మంది విద్యార్దులు ఉత్తీర్ణులు అవ్వగా 145 మంది విద్యార్దులు ఫెయిల్ అయ్యారని చార్మినార్ జోన్ ఉప విద్యాశాఖాధికారి నెహ్రూ బాబు వెల్లడించారు.చార్మినార్ జోన్ పరిధిలో ఎకు ౨వ శాతం గణంతంలో ఫెయిల్ అయ్యారని ఆయన తెలిపారు.కాగా చార్మినార్ జోన్ పరిధిలోని తెలంగాణ మైనార్టీ హైస్కూళ్లకు చెందిన 650 మంది విద్యార్దులకు గాను 576 మంది విద్యార్దులు,(89 శాతం) ఎయిడెడ్ పాఠశాలలో 51 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 31 మంది (61 శాతం) విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారని నెహ్రూ బాబు తెలియజేశారు. కాగా పాతబస్తీ సుల్తాన్‌షాహి ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన డి.మేఘనకు పదివ తరగతి పరీక్షలో 9.5 పాయింట్లు వచ్చాయని ఆయన తెలిపారు.


లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం

## ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రజలకు భరోసా : ఎమ్మెల్యే మాధవరం

మూసాపేట, మే 10, ప్రభాతవార్త : ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు ఎంతో భరోసా నిస్తున్నాయని కూకట్‌పల్లి నియోజకవర్గం శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. బుదవారం కూకట్‌పల్లి క్యాంపు కార్యాలయంలో 173మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర అవిర్భావం నుంచి సంక్షేమ పథకాల అమలుపై ముఖ్యమంత్రి కెసిఆర్ తనదైన శైలిలో చెరగని ముద్ర వేస్తూ ముందుకు సాగుతున్నారని అన్నారు. పేదల బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎప్పటికప్పుడు, ఏయేటికాయేడు వినూత్న, విప్లవాత్మక పథకాలకు శ్రీకారం చుడుతూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. సంబడ వర్గాల సంక్షేమానికి కొత్త బాటలు వేయడమే కాకుండా దేశానికి కొత్తదారిని చూపుతున్నారని అన్నారు.

## బాలికలు నిరంతరం కష్టపడి చదవాలి : పర్వతాలు



అశ్రిత్ హోంకు చెందిన బాలికలు

చార్మినార్, మే 10 ప్రభాతవార్త : బాలికలు నిరంతరం కష్టపడి చదివితే తప్పకుండ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అశ్రిత రెయిన్‌బో కమ్యూనిటీ కేర్‌కో ఆర్డినేటర్ వి.పర్వతాలు అన్నారు.ఇంటర్మీడియట్,పదివ తరగతి పరీక్షలలో మంచి మార్కులు సాధించిన అశ్రిత్ హోం రెయిన్‌బోకు చెందిన బాలికలను ఆయన బుధవారం అభినంధించారు. ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడుతూ బాల్యంలోనే తల్లిదండ్రులు దూరమైన పావనీ అనే విద్యార్థినికి ఇంటర్మీడియట్ లో 926 మార్కులు వచ్చాయని,అశ్రిత్ హోంకు చెందిన బీద పిల్లలైన 9 మంది బాలికలు ద్వితీయ, నలుగురు బాలికలు మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్‌లో, నలుగురు బాలికలు పదివ తరగతిలో ఉత్తీర్ణులు అయ్యారని తెలిపారు.బాలి కలు మరింత కష్టపడి చదవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో అశ్రిత హోం సిబ్బంది శేఖర్, సాత్విక, నాగమణి,రామస్వామిలు పాల్గొన్నారు.

## హన్సరాజ్‌ను కలిసిన శ్రీధర్


హన్సరాజ్‌కు పుష్పగుచ్ఛాలతో సత్కరిస్తున్న శ్రీధర్

సైఫాబాద్, మే 10 ప్రభాతవార్త: ఖేలో తెలంగాణ-జీతో భాగ్యనగర్ కార్యక్రమంలో భాగంగా నగరానికి విచ్చేసిన జాతీయ ఓబిసి కమిషన్ ఛైర్మన్ హన్సరాజ్ గంగారాం అహిర్‌ని బుధవారం ఓబిసి మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీధర్ ఛైర్మన్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు డా.కె.లక్ష్మణ్, ఇతర బిజెపి నాయకులు కూడా ఉన్నారు.

## ఉద్యమకారుల సంక్షేమ బోర్డు కోసం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం

అల్వాల్, మే 10 ప్రభాతవార్త: తెలంగాణా ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం బుధవారం ఓల్డ్ అల్వాల్‌లోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఉద్యమకారులు ఫోరం ప్రధాన కార్యదర్శి పటోళ్ళ సురేందర్ రెడ్డి ఆద్వర్యంలో కార్యక్రమం జరిగింది. ప్రత్యేక రాష్ట్ర సాధనలో సుమారు 1200 మంది ఆత్మబలిదానాలు చేశారన్నారు. ఉద్యమం కోసం భార్య బిడ్డలను వదిలి ఆర్థికంగా నష్ట పోయారని సురేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు తమ మ్యానిఫెస్టోలో ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటును చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, సంఘమేశ్వర్, కాశీనాథ్, సుదర్శన్ పాల్గొన్నారు.

## వైభవంగా శివరామంజనేయ దేవాలయ విగ్రహా ప్రతిష్ట కుంభాభిషేక మహోత్సవం


కబీర్‌నగర్‌లో శ్రీశ్రీశ్రీ శివరామాంజనేయ దేవాలయ విగ్రహా ప్రతిష్ట కుంభాభిషేకంలో పాల్గొన్న వేదపండితులు

యూసుఫ్‌గూడ, మే 10, ప్రభాతవార్త : మోతీనగర్ ప్రాంతంలోని కబీర్‌నగర్ మోతీనగర్ ఎక్స్‌టెక్షన్‌లో పునర్మించిన శ్రీశ్రీశ్రీ శివరామంజనేయ దేవాలయ విగ్రహా ప్రతిష్ట కుంభాభిషేక మహోత్సవం మొదటి రోజు బుధవారం అంగరంగ వైభవంగా పూజలు ప్రారంభమయ్యాయి. ఈనెల 14వతేది ఆదివారం వరకు ఈ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేదుకు ఆలయ కమిటి సభ్యులు భక్తులకు అన్ని ఏర్పాట్లను చేశారు. తిరుపతి తిరుమల దేవస్థానం నుండి నాలుగు వేదాలయ పండితులు పాల్గొన్నారు. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్మణ వేదం, అదేవిధంగా మహారాష్ట్ర కర్ణాటక, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలనుంచి 21మంది వేదపండితులు పాల్గొంటున్నారు. అమ్మవారికి శ్రీచక్రార్చనతో పాటు ఆంధ్రప్రదేశ్ రాజమండ్రి నుండి హేమాద్రి శర్మ, ఏకదాటిగా 9గంటల పాటు పూజలు నిర్వహించారు. మొదటిరోజు జలాదివాసం, 108నది జలాలతో దేవతలకు అభిషేకం చేయడం జరిగింది. అగ్నిమదనంతో అగ్నిని వెలిగించడం జరిగింది. గణపతి పూజ, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, వాస్తుపూజ, యోగిని, క్షేత్ర పాలక, నవగ్రహా, సర్వతోభద్రమండల దేవాతా ఆవాహన, గణపతి హోమం, వాస్తు హోమం, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారు.



## దుర్గానగర్‌లో పేలిన సిలిండర్

### ధ్వంసమైన భవనం గోడలు

మైలార్‌దేవ్‌పల్లి,మే 10 ప్రభాతవార్త : ఇంట్లో వంట చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు గా గ్యాస్ సిలిండర్ పేలిగిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది.ఈ సంఘటనలో సిలిండర్ పేలిన శబ్దానికి భవనం గోడలు పగిలి పోయాయి. ఎటువంటి ప్రాణనష్టం జరగ లేదు.మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాజశేఖర్ కథనం ప్రకారం.. దుర్గానగర్‌లో రవీందర్‌సింగ్‌కు చెందిన మూడు అంతస్థుల భవనం ఉంది. కాగా బిహార్‌కు చెందిన రవిరాజ్ కుమార్,అశ్మిత కుమారి దంపతుల కుటుంబ సభ్యులు రవీందర్‌సింగ్‌కు చెందిన భవనంలోని రెండవ అంతస్థులో ఉన్నారు.బుధవారం ఉదయం హెచ్‌పి సిలిండర్ ఇంటికి వచ్చిన వెంటనే అశ్మిత కుమారి స్టౌవ్ వెలిగించి అన్నం వండుతున్నది.కాగా ఒక్కసారి సిలిండర్ నుంచి పెద్ద ఎత్తున మంటలు వచ్చాయి. మంటలతో పాటు సిలిండర్ పేలడంతో భవనానికి చెందిన గోడలు పూర్తిగా ద్వంస మయ్యాయి. పెద్ద శబ్దం రావటంతో ఇంట్లో ఉన్న వారంతా బయటకు పరుగులు తీశారు.ఈ సంఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఈ కేసును మైలార్‌దేవ్ పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## గండిపేట మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన ఉత్తీర్ణత శాతం

### వందశాతం ఫలితాలు సాధించిన సోషల్ వెల్ఫేర్ పాఠశాల

నార్సింగి, మే 10 ప్రభాతవార్త : ఈ విద్యా సంవత్సరం గండిపేట మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల ఉత్తీర్ణత శాతం పెరిగింది. నార్సింగిలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న 71.మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా 71.మంది ఉత్తీర్ణత పొంది 100.శాతం పాస్ అయ్యారు. వీరిలో ఒకరు 10/10 మార్కులు సాధించారు. అలాగే కిస్మత్‌పూర్‌లోని కస్తూర్బాగాంధీ విధ్యాలయకు చెందిన 45.మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 43.మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి 98.శాతం పాస్ అయ్యారు. నార్సింగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 120.మంది పరీక్షలు రాయగా 93.మంది పాస్ అయ్యి 78.శాతం ఉత్తీర్ణత శాతంను పొందారు. మణికొండ జిల్లా పరిషత్ పాఠశాల నుంచి 182.మంది పరీక్షలు రాయగా 141.మంది పాస్ అయ్యి, 77.శాతం ఉత్తీర్ణత శాతంను సాధించారు. వట్టి నాగులపల్లి పాఠశాల నుంచి 30.మంది పరీక్షలు రాయగా 18.మంది పాస్ అయ్యి, 60.శాతం ఉత్తీర్ణతను పొందారు. హైదర్షాకోట్ పాఠశాల నుంచి 66.మంది పరీక్షలు రాయగా 35.మంది ఉత్తీర్ణత పొంది, 53.శాతం పాస్ అయ్యారు. అలాగే కోకాపేట్ పాఠశాల నుంచి 35.మంది పరీక్షలు రాయగా కేవలం 15 మంది మాత్రమే పాస్ అయ్యి 43.శాతం ఉత్తీర్ణతను సాధించారు. నార్సింగికి చెందిన సాధియా బేగం 9.8 మార్కులు సాధించింది. ప్రైవేటు తరగతులు నిర్వహించి, శక్తికి మించి బోధనలు చేసినా ఆశించిన ఫలితాలు రాలేదని పలువురు అధ్యాపకులు పేర్కొన్నారు. గండిపేట మండలం నుంచి మొత్తం 549.మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 416.మంది పాస్ అయ్యి, 72.శాతం ఉత్తీర్ణత శాతంను పొందారు.

## ఇంటి తాళాలు పగులగొట్టి చోరీల దొంగ అరెస్టు

### 22 కేసుల్లో నిందితుడిగా గుర్తించిన పోలీసులు

నార్సింగి, మే 10 ప్రభాతవార్త : ఇంటి తాళాలు పగులగొట్టి దొంగతనాలు చేస్తున్న పాత నేరస్థుడిని నార్సింగి పోలీసులు బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఇతడు గతంలో చిక్కడపల్లి, నల్లకుంట, కూకట్‌పల్లి, చైతన్యపురి, బంజారాహిల్స్, ఎస్ఆర్.నగర్, కెపిహెచ్‌బి, మాదాపూర్, వనస్థలిపురం, రాయదుర్గం, పేట్‌బషీర్‌బాద్, నార్సింగి, చందానగర్ పోలీసు స్టేషన్ల పరిధిలో 22.కేసుల్లో నిందితుడిగా గుర్తించారు. ఇతడి వద్ద నుంచి చోరీ సొత్తును రికవరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్ నగరంలోని బేగంబజార్‌కు చెందిన రమేష్‌సింగ్ కుమారుడు ఘన్‌శ్యామ్(30) బల్కంపేటలో నివాసం ఉంటూ ఆన్‌లైన్‌లో బట్టలు అమ్ముతుంటాడు. పగటి పూట తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి, రాత్రిపూట తాళాలు పగులగొట్టి చోరీలు చేయడంలో ఇతడు దిట్ట. వరుసగా ఇలాంటి దొంగతనాలే చేస్తూ పోలీసులకు పట్టుబడుతున్నాడు. ఇతడిపై పీడీయాక్ట్‌ను కూడా ప్రయోగించినా ఫలితం లేదు. జైలు నుంచి విడుదల అవ్వగానే మళ్లీ తన చోరకళను ప్రదర్శిస్తూ అందిన కాడికి దండుకుంటాడు. గండిపేట మండలం పుప్పాలగూడ గ్రామంకు చెందిన కొత్తూరి వీర వెంకట గోపినాథ్ భార్య బ్యాగరి రాజమణి బ్యూటీషన్‌గా పని చేస్తుంది. ఈమె 25.ఏప్రిల్ 2023న తన ఇంటికి తాళం వేసి ఓయు కాలనీలోని బ్యూటీషియన్ షాపుకు వెళ్లి రాత్రి తొమ్మిదిన్నర గంటలకు ఇంటికి వచ్చింది. ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉంచిన 15.గ్రాముల బంగారు చైన్, 20.గ్రాముల మంగళసూత్రాలు, 20.గ్రాముల బంగారు గాజులు, 5.గ్రాముల బంగారు ఉంగరాలు, 20.గ్రాముల బంగారు చైన్, లాకెట్, రూ.50.వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి నార్సింగి పోలీసులకు 26.వ, తేదీన ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు అందుకున్న నార్సింగి పోలీసులు సీసీ టీవి ఫుటేజిలను పరిశీలించగా పాత నేరస్థుడి ఆనవాళ్లు కనిపించాయి. అతడిని అదుపులోకి తీసుకొని విచారిస్తే నేరం చేసినట్లు అంగీకరించాడు. అతడి వద్ద నుంచి సొత్తు రికవరీ చేసి జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## ఏడేళ్ల చిన్నారి ప్రపంచ రికార్డు కైవసం


వేంకటేశ్వరస్వామి 108గోవిందనామాలపై కూచిపూడి నృత్యంతో 7ప్రపంచ రికార్డులు సాధించిన చిన్నారి కియారరెడ్డి

నాంపల్లి, మే 10 ప్రభాతవార్త : ప్రముఖ సాంస్కృతిక సంస్థ అవని నృత్యాలయం ఐఎస్‌కె.విజేంద్ర, ఎ.ధన లక్ష్మిల ఆధ్వర్యంలో నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో నృత్యాలయానికి చెందిన 7ఏళ్ల చిన్నారి నర్తకి కియారరెడ్డి 7కిలోల బరువు గల 7కుండలతో 77 డియాస్‌ను తలపై పెట్టుకొని 7 నిముషాలపాటు శ్రీవేంకటేశ్వరస్వామి 108 గోవింద నామాలపై సోలో కూచిపూడి నృత్యాన్ని అత్యంత వైభవం నేత్రపర్వంగా ప్రదర్శించి ప్రముఖ 7 ప్రపంచ రికార్డులు భారత్ వరల్డ్ రికార్డ్, వరల్డ్ రికార్డ్స్, లిమ్రన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్స్, టాలెంట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, ఇండియన్ ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్స్, తెలుగు వరల్డ్ రికార్డ్స్, ఎక్సలెన్సీ వరల్డ్ రికార్డ్స్‌లను కైవసం చేసుకొని విచ్చేసిన అశేష కళాప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులను అబ్బురపరచి ఎంతగానో అలరించి మంత్రముగ్ధులను చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఎమ్మెలే కె.పి.వివేకానంద, భారత్ వరల్డ్ రికార్డ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్స్ కోఆర్డినేటర్ లయన్ కె.వి.రమణా రావులు, ప్రత్యేక అతిథులు నేషనల్, ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్స్ ఆర్గనైజేషన్ కోఆర్డినేటర్ శారద, ఎం.గోపాల్‌రెడ్డి, రవీందర్‌యాదవ్, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు ఎం.కృష్ణారెడ్డి, బిఆర్ఎస్ అధ్యక్షుడు దుండిగల్ మున్సిపాలిటీ ఎం.సంజీవరెడ్డి, నాట్యగురువు డా. కె.శ్రీకాంత్‌గౌడ్, అడ్డ సతీష్, ఆర్.వి.సుబ్బు, కె.విజయపాల్‌రెడ్డి తదితరులతో కలిసి చిన్నారి నర్తకి కియారరెడ్డిని ఆమె తల్లిదండ్రులు కుటుంబసభ్యుల మధ్య ఘనంగా సత్కరించి 7 ప్రపంచ రికార్డులను ప్రదానం చేసి ఎంతగానో అభినందించి శుభాశీస్సులు, శుభాకాంక్షలు అందజేసి ముమ్ముందు మరిన్ని రికార్డులు సాధించాలని ఆకాంక్షించారు.

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


మృతుడు కిషోర్ ఫోటో(ఫైల్)

చిక్కడపల్లి, మే 10 ప్రభాతవార్త: ఆర్థిక ఇబ్బందులతో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిక్కడపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం జరిగింది. స్థానిక ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కృష్ణాజిల్లా వీర్లపాడు మండలం నందలూరు గ్రామానికి చెందిన కొప్పుల కిషోర్(33) చిక్కడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయం వీధిలోని ఉమాగార్డెన్‌లో మూడు సంవత్సరాల నుంచి ఐఎఫ్‌బి సర్వీస్ పేరుతో వాషింగ్ మిషన్ రిపేర్ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకుని జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. 15 సంవత్సరాల కింద తన మేన మామ కూతురు అయిన లక్ష్మీతిరుపతమ్మతో పెద్దలు కుదిర్చిన వివాహం జరిగింది. కుమార్తె చరిత, కుమారుడు బిశ్వా ఉన్నారు. గత కొన్ని రోజుల కింద వేసవి సెలవుల నిమిత్తం తన సొంతూరులో పిల్లలను వదిలిపెట్టి వచ్చారు. సోమవారం నాడు పిల్లలను తిరిగి హైదరాబాద్‌కు తీసుకువచ్చేందుకు తిరుపతమ్మ వెళ్లింది. తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న కిషోర్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. సిఐ ఎన్. సంజయ్‌కుమార్ పర్యవేక్షణలో ఎస్ఐలు వెంకటరమణ, నాగరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరిపారు.

## పార్కింగ్ సమస్య పరిష్కరించనందుకు నిరసన

చిక్కడపల్లి, మే 10 ప్రభాతవార్త: ఆర్టీసిక్రాస్‌రోడ్స్ నుంచి అశోక్‌నగర్ వరకు స్టీల్‌బ్రిడ్జ్ నిర్మాణం జరుగుతున్న ప్రదేశంలో డివైడర్ల కింద పార్కింగ్ సమస్యను పరిష్కరించనందుకు నిరసనగా గురువారం వ్యాపారసంస్థలన్నీ బంద్ పాటించాలని నిర్ణయించినట్లు జవహర్‌నగర్ ఫెడరేషన్ ప్రతినిధి సింగారపు రమేశ్ పిలుపునిచ్చారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్‌లకు పలుమార్లు సమస్యపై విన్నవించినా కూడా ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉన్నదని, తమ సమస్య మాత్రం పరిష్కారం కాలేదని, ఇప్పటికే తమ వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, వ్యాపారస్తులను పట్టించుకునేనాథుడే లేకుండా పోయారని అన్నారు. తాము చేపట్టే నిరసన కార్యక్రమం ద్వారానైనా ప్రభుత్వంలో, ప్రజాప్రతినిధుల్లో కదలిక వచ్చి తమ సమస్య పరిష్కారమవుతుందని భావిస్తున్నామని అన్నారు.

## అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందిస్తాం: కార్పొరేటర్ జితేందర్‌నాథ్


పాదయాత్రలో కార్పొరేటర్

అల్వాల్, మే 10 ప్రభాతవార్త: ప్రజలకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పిస్తామని మచ్చబొల్లారం కార్పొరేటర్ జితేందర్‌నాథ్ తెలిపారు. బుధవారం డివిజన్ పరిధిలోని తిరుమల కాలనీ, భగీరథ కాలనీ, జైన్ మందిర్ పరిసర ప్రాంతాలులో అధికార యంత్రాంగంతో కలిసి కార్పొరేటర్ పాదయాత్ర చేశారు. సిసి రోడ్లు, ఓపెన్ డ్రైనేజీ మరమత్తులు ఇతర సమస్యలను స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. సమస్యలు అన్నింటికి పరిష్కారం చూపుతామని జితేందర్‌నాథ్ హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు శ్రీశైలం, భగీరథ్, పరమేష్, శ్రావణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి ప్రాధాన్యత

### కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్

అల్వాల్, మే 10 ప్రభాతవార్త: ప్రజలకు కనీస వసతులు అందించాల్సిన బాధ్యత తనదని వెంకటాపురం కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్ తెలిపారు. బుధవారం డివిజన్ పరిధి లోని పాత వెంకటాపురంలో 33 లక్షలు వ్యయంతో చేపట్ట నున్న అంతర్గత రోడ్లు పనులను కార్పొరేటర్ ప్రారంభిం చారు. డివిజన్ పరిధిలో ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు సహాయ సహకారాలుతో ఇప్పటికే కోట్లాది రూపాయల తో అభివృద్ధి పనులు పూర్తి చేశామని సబిత అనీల్ కిషోర్ చెప్పారు. పాత వెంకటాపురం ప్రజలు సమస్యలు అన్నిం టిని పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు అనీల్ కిషోర్, మోసిన్, సంతోష్, విజయ శేఖర్, రఘుపతిరెడ్డి, జనార్ధన్, ప్రకాష్, అరుణ్, రాము పాల్గొన్నారు.

## బాలుడి కృత్రిమ మేధస్సును అభినందించిన మంత్రి కెటిఆర్


విద్యార్థి అభినవ్‌ను అభినందిస్తున్న మంత్రి కెటిఆర్

యూసుఫ్‌గూడ, మే 10, ప్రభాతవార్త : సరికొత్త సాంకేతిక పరిజ్ఞానానికి వేదికగా దేశంలోనే తొలిసారిగా నగరం లోని టి హాబ్‌లో మంగళవారం రాష్ట్ర ఐటీ శాఖ ప్రతిష్టాత్మకంగా రూపొందించిన రోబోటిక్ ఫ్రేమ్ వర్క్ ప్రారంభోత్సవానికి వెంగళరావు నగర్ నలంద స్కూల్‌కు చెందిన 9వతరగతి విద్యార్థి అభినవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నేటి యువతరం మీద రోబోటిక్స్ కృత్రిమ మేధస్సు ప్రభావాన్ని గుర్తించి ఐటీ మంత్రి కెటిఆర్‌తో తన అభిప్రాయాలను అభినవ్ వ్యక్తపరిచారు. సామాన్య మానవులకు కూడా రోబోటిక్ సాంకేతికతమనీ ఏవిధంగా ఉపయోగపడాలో అభివృద్ధి చేయవచ్చో ఈ సందర్భంగా మంత్రి కెటిఆర్‌కు వివరించారు. అభినవ్ అభిప్రాయాలను ఆలోచనా విదానాన్ని మంత్రి అభినందించారు. ఈమేరకు వెంగళరావు నగర్‌లోని నలంద స్కూల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నలంద విద్యా సంస్థల చైర్మన్ మంతెన శ్రీనివాసరాజు మాట్లాడుతూ తమ స్కూల్ 9వతరగతి విద్యార్థి అభినవ్ ఇప్పటికి పలు జాతీయ ,అంతర్జాతీయ కృత్రిమ మేధో సదస్సులకు హాజరై తన ప్రతిభను చాటారని వివరించారు. భవిష్యత్తులో మాస్టర్ అభినవ్ మరిన్ని రోబోటిక్ అవిష్కరణలతో మన రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా బుధవారం వచ్చిన 10వతరగతి పరీక్ష ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాదించారని వారిని ఈసందర్భంగా అభినందించారు.

## కార్మిక పక్షపాతి నాయిని నరసింహారెడ్డి

### ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



ధర్నాచౌక్, మే 10, ప్రభాతవార్త: కార్మిక పక్షపాతి నాయిని నరసింహారెడ్డి అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ కొనియాడారు. బుధవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో కొనసాగుతున్న నాయిని నరసింహారెడ్డి క్రికెట్ లీగ్-2 లో ఐదవ రోజు మూడవ రౌండ్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, నాయిని నరసింహారెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళుల ర్పించారు. అనంతరం టాస్ వేసి క్రికెట్ పోటీలనుప్రారంభించి, పోటీల లో పాల్గొంటున్న యువతను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమం లో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, ఫౌండేషన్ ఉపాధ్య క్షులు నాయిని దేవేందర్‌రెడ్డి, బీఆర్ ఎస్ నాయకులు సిరిగిరి శ్యాం, రేషం మల్లేష్, కల్వగోపి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : సదాకేశవరెడ్డి


వార్డు 3 పీఅండ్‌టీ కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న సదాకేశవరెడ్డి

బేగంపేట మే 10,ప్రభాత వార్త : కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలోని వార్డు3 పీఅండ్‌టీ కాలనీలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సదాకేశవరెడ్డి బుధవారం పర్యటిం చారు. ఈ సందర్భంగా కాలనీ వాసుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్ నియోజకవర్గంలోని అన్ని వార్డులలో ఎక్కువగా పేదలు, మధ్యతరగతి వారు నివసిస్తుంటారని, వారి సమస్యలు తెలుసుకునేందుకు తాను వార్డులలో పర్యటించి వారి సమస్యలను కంటోన్మెంట్ అధికారుల దృష్టికి తీసికెళ్లి ఆయా సమస్యలు వేగవంతంగా పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని అన్నారు. ఇందిరమ్మనగర్, పోచమ్మ ఆలయం, పెద్ద రోడ్డు ,సీబీఎన్ నగర్ మీదుగా ఉన్న జేకే లైన్ బకెట్ మిషిన్ సహాయంతో క్లీనింగ్ పనులు బుధవారం ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో దాఫెదర, రాజేష్, శ్యామ్, లోకేష్, అశోక్‌గౌడ్, జబ్బార్, పాండు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పథకాన్ని సాధించిన రవిసింగ్


రవిసింగ్‌ను శాలువాతో సత్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌యాదవ్

సంజీవరెడ్డి నగర్, మే 10, ప్రభాతవార్త : కేరళలో జరిగిన 2023 ఏషియన్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో 105 కిలోల విభాగంలో 12 దేశాలు పాల్గొనగా భారతదేశం తరపున తెలంగాణ స్టేట్‌లో సనత్ నగర్‌కు చెందిన రవిసింగ్ బిడ్లాన్ బంగారు పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా బుధవారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రి రవిసింగ్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. మంత్రి మాట్లాడుతూ ఏషియన్ పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించి ఇప్పటివరకు ఎవరూ కూడా తీసుకురాని ఏషియన్ టైటిల్ స్ట్రాంగ్‌మెన్ బెస్ట్ లిఫ్టర్ అవార్డు కైవసం చేసుకున్నందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇలాంటివి ఎన్నో అవార్డులను గెలవాలని రవిసింగ్ బిడ్లాన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి, నవీన్‌కుమార్, గోపాల్‌రెడ్డి, రవికుమార్, నర్సింగ్‌రావు, నవీన్, బిడ్లాన్, ముఖేష్‌కుమార్, రమేష్ బోయ తదితరులు పాల్గొన్నారు.

## వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలి

### కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

మూసాపేట, మే 10, ప్రభాతవార్త : 124 డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ హిందు స్మశానవాటిక సుందరీకరణ పనులలో భాగంగా నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మశానవాటికలో ఇప్పటికే సీసీరోడ్లు, రిటైనింగ్ వాల్, ఎలక్ట్రికల్ బర్నింగ్ ప్లాట్‌ఫామ్, వెయిటింగ్ హాల్ నిర్మాణం పూర్తయిందని అన్నారు. బర్నింగ్ ప్లాట్‌ఫామ్, కమాన్, స్నానాల గదులు వంటివి నిర్మాణ దశలో ఉన్నాయని వాటిని కూడా వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. స్మశానవాటిక ఆవరణంలో మొక్కలను పెంచి ఉద్యానవనం ఏర్పాటు చేసి అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దాదాపు పనులన్నీ పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు. గ్రేవ్ యార్డ్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం కొరకు త్వరలో నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాసుదేవరావు, సాయిగౌడ్, వర్క్‌ఇన్స్‌పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ప్రధాన సలహాదారుల నియామకంపై విచారణ జరిపించాలి

### టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా


టీడీపీ నేతల సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

ధర్నాచౌక్, మే10, ప్రభాత వార్త: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులుగా పదవీ కాలం ముగిసిన వారిని తిరిగి ప్రభుత్వ ప్రధాన సలహాదారులుగా నియమించటం పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, దీనిపై కేంద్రం జోక్యం చేసుకుని నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ కార్యాలయంలో స్థానిక టీడీపీ నేతలతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ ఛీఫ్ సెక్రటరీలుగా పనిచేసి పదవీ విరమణ పొందిన రాజీవ్ శర్మను, ఎస్.కే.జోషి, తరువాత ఇప్పుడు ఎన్నో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సోమేష్‌కుమార్‌ను ప్రభుత్వ సలహాదారులుగా ముఖ్యమంత్రి కేసీఆర్ నియమించుకోవటం పట్ల ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యక్రమాలలో కమీషన్లు దండుకుని భాగాలు పంచుకుని భాగస్వాములుగా ఉన్నారు కాబట్టే వారిని ప్రభుత్వ ప్రధాన సలహాదారులుగా నియమించుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులుగా పనిచేస్తున్న వారితో కుమ్మక్కై అవినీతికి పాల్పడుతూ, అవినీతిలో భాగం పంచుకుంటున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, దీనిపై కేంద్రం జోక్యం చేసుకుని విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల్ల కిషోర్, ప్రధాన కార్యదర్శి పి.బాలరాజ్‌గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దోజు రవీంద్రాచారి పాల్గొన్నారు.

## విద్యార్థులకు అభినందన సభ

ఘట్‌కేసర్, మే 10, ప్రభాతవార్త : ఘట్‌కేసర్ మున్సిపాల్టీ పరిధిలోని జడ్‌పిహెచ్ఎస్ బాలికల పాఠశాల విద్యార్థినిలు 91శాతం ఉత్తీర్ణత సాధించినందుకు ఘట్‌కేసర్ మున్సిపాల్టీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అభినందించారు.

## విద్యార్థులను సన్మార్గంలో ప్రోత్సహించాలి

### తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి



విద్యార్థులను అభినందిస్తున్న పులిగారి గోవర్ధన్‌రెడ్డి

ధర్నాచౌక్, మే 10, ప్రభాతవార్త: విద్యార్థులను అటు తల్లి తండ్రులు, ఇటు ఉపాధ్యాయులు సన్మార్గంలో ప్రోత్సహించాలని, విద్యార్థులను ప్రోత్సహిస్తే అద్భుతంగా రాణిస్తారని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం కవాడిగూడలోని ఇంగ్లీష్ యూనియన్ స్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులు 98శాతం ఉత్తీర్ణతతో పాటు 60 మంది విద్యార్థులు సీజిపిఏ 10 సాధించటంతో ఆయన విద్యార్థులను ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్న పాఠశాల ఉపాధ్యాయులను, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను బొకేలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్స్‌పాల్ పి.స్వర్ణలత, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## కంటోన్మెంట్‌ను గ్రేటర్‌లో విలీనం చేస్తేనే అభివృద్ధి : జంపన


కంటోన్మెంట్‌ను గ్రేటర్‌లో విలీనం చేసేందుకు పోస్టు కార్డు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వికాస్ మంచ్ ప్రతినిధులు సంకి రవిందర్, గడ్డం ఏబేలు,జంపనప్రతాప్ తదితరులు

కంటోన్మెంట్,మే 10 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాన్నీ గ్రేటర్‌లో విలీనం చేయాలని కోరుతూ వికాస్ మంచ్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం 6వ వార్డులోని జూపిటర్ కాలనీ, జవహర్ కాలనీ, రైల్వే కాలనీ ప్రాంతాల్లో ప్రధాన మంత్రికి 4వ విడత పోస్టు కార్డు ఉద్యమ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, వికాస్ మంచ్ అధ్యక్ష,కార్యదర్శులు గడ్డం ఏబేలు, సంకి రవిందర్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డు జిహెచ్ఎంసిలో విలీనం చేస్తేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ అంశాన్ని ప్రధాన మంత్రి సానుకూలంగా స్పందించి జిహెచ్ఎంసిలో విలీనం చేసేందుకు ఈ పోస్టు కార్డు ఉద్యమం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వికాస్ మంచ్ ప్రతినిధులు మహ్మద్ పసీ, మనీస్, కండేవాలా, జాఫర్‌ఖాన్, మహేశ్, సింగ్, రాజేశ్, శ్రీకాంత్, మురళీ పాల్గొన్నారు.

# గచ్చిబౌలి చౌరస్తా వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులు

### ఈనెల 13నుంచి 90రోజుల పాటు ట్రాఫిక్ దారి మళ్లింపు

గచ్చిబౌలి, మే 10 ప్రభాతవార్త : ఔటర్ రింగురోడ్డు మీద నుంచి కొండాపూర్ వైపు వచ్చే వాహనదారులకు గచ్చిబౌలి చౌరస్తా ట్రాఫిక్ ఇబ్బందులను దూరం చేయడం కోసం నిర్మిస్తున్న గచ్చిబౌలి చౌరస్తా ఫ్లైఓవర్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఔటర్ పైనుంచి మాదాపూర్ వైపు వెళ్లే వాహనదారుల కోసం ఇప్పటికే శిల్పా లేఅవుట్ ఫేజ్-1 ఫ్లైఓవర్‌ను పూర్తి చేసి ప్రజలకు అందుబాటుకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఔటర్ నుంచి కొండాపూర్ వైపు ప్రయాణించే ప్రయాణికుల కోసం శిల్పా లేఅవుట్ ఫేజ్-2 ఫ్లైఓవర్‌ను నిర్మిస్తున్నారు. కాగా ఈ నిర్మాణ పనుల కారణంగా వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్‌కు దారి మళ్లిస్తున్నట్లు సైబరాబాద్ పోలీసులు ప్రకటించారు. ఈమేరకు మాదాపూర్ డిసిపి శిల్పావల్లి మాట్లాడుతూ ఫ్లైఓవర్ నిర్మాణ పనుల కారణంగా ట్రాఫిక్‌కు ఇబ్బందులు కాకుండా ముందుజాగ్రత్తగా దారి మళ్లింపు చేపడుతున్నట్లు తెలిపారు. గచ్చిబౌలి చౌరస్తా వద్ద ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ఈనెల 13వ తేదీ నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు 90 రోజుల పాటు ట్రాఫిక్‌ను దారి మళ్లిస్తున్నట్లు తెలిపారు. వాహనదారులు సహకరించాలని సూచించారు.

- ఔటర్ నుంచి హాఫీజ్‌పేట్ వైపు ప్రయాణించే ప్రయాణికులు శిల్పా లేఅవుట్ ఫేజ్-1 ఫ్లైఓవర్ మీదుగా ప్రయాణించి, మీనాక్షి టవర్స్, ఏఐజీ ఆసుపత్రి, క్యూమార్ట్ భవనం, కొత్తగూడ ఫ్లైఓవర్ మీదుగా ప్రయాణించాలని సూచించారు
- లింగంపల్లి నుంచి కొండాపూర్ వైపు ప్రయాణించే వాహనాలు గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, డిఎల్ఎఫ్ రహదారి, రాడిసన్ హోటల్, కొత్తగూడ మీదుగా ప్రయాణించాలన్నారు
- విప్రో చౌరస్తా నుంచి ఆల్విన్ ఎక్స్‌రోడ్డు వైపు ప్రయాణించే వారు ట్రిపుల్‌ఐటి జంక్షన్, గచ్చిబౌలి స్టేడియం వద్ద యూటర్న్ తీసుకొని, డిఎల్ఎఫ్ రోడ్డు, రాడిసన్ హోటల్ మీదుగా ప్రమాణించాలన్నారు
- టోలిచౌకి నుంచి ఆల్విన్ ఎక్స్‌రోడ్డు వైపు ప్రయాణించే వారు బయోడైవర్‌సిటీ ఫ్లైఓవర్ మీదుగా మైండ్‌స్పేస్ జంక్షన్, సైబర్ టవర్స్ జంక్షన్, కొత్తగూడ జంక్షన్ మీదుగా ప్రయాణించాలని సూచించారు
- టెలికాంనగర్ నుంచి కొండాపూర్ వైపు వెళ్లే ప్రయాణికులు గచ్చిబౌలి పాత ఫ్లైఓవర్ కింద యూటర్న్ తీసుకొని శిల్పా లేఅవుట్ ఫ్లైఓవర్, ఏఐజీ ఆసుపత్రి, క్యూమార్ట్ భవనం మీదుగా ప్రయాణించాలన్నారు
- ఆల్విన్ ఎక్స్‌రోడ్డు నుంచి గచ్చిబౌలి వైపు ప్రయాణించే ప్రయాణికులు కొత్తగూడ చౌరస్తా నుంచి సైబర్ టవర్స్‌చౌరస్తా, మైండ్‌స్పేస్ చౌరస్తా, శిల్పా లేఅవుట్ ఫ్లైఓవర్ మీదుగా ప్రయాణించాలని తెలిపారు
- హాఫీజ్‌పేట్ నుంచి లింగంపల్లి వైపు వెళ్లే ప్రయాణికులు బొటానికల్ గార్డెన్ జంక్షన్, మజీద్‌బండ, హెచ్‌సియు డిపో మీదుగా లింగంపల్లి వెళ్లాలని సూచించారు.

## ఆర్టీసీ బస్సు డోరు విరిగి ప్రయాణికులకు తీవ్ర గాయాలు

### ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు



ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు

పేట్‌బషీరాబాద్, మే10 ప్రభాతవార్త: ఆర్టీసీ బస్సు డోరు విరిగిపోయి ఇద్దరి ప్రయాణీకులకు తీవ్ర గాయాలైన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. సుచిత్ర జయరాం నగర్‌కు చెందిన అపర్ణ అనే మహిళ తన కుమారుడితో ఏపీ11 జెడ్ 7532 అనే నెంబర్ గల 229 రూట్ బస్సులో మేడ్చల్ నుంచి సుచిత్రకు బయలుదేరారు. కొంపల్లి, దూలపల్లి కూడలికి బస్సు రాగానే ఒక్కసారిగా ఎమర్జెన్సీ డోరు ఊడిపోవడంతో ప్రయాణీకురాలు అపర్ణ, తన కుమారుడు గౌరవ్ ఇద్దరు బస్సులో నుంచి కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో కుమారు గౌరవ్ స్వల్ప గాయాలతో బయట పడగా తీవ్ర గాయాలపాలైన అపర్ణను చికిత్స నిమిత్తం సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆర్టీసీ సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈప్రమాదం జరిగిందని, ప్రైవేటు బస్సులో రక్షణ ఉండదని ఆర్టీసీ బస్సులోనే ప్రయాణించాలని సూచించే ప్రభుత్వం, ఆర్టీసీ అధికారులు జరిగిన ప్రమాదానికి ఎలాంటి సమాధానం చెబుతారని ప్రయాణీకులు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యులు ఈ ప్రమాదంపై పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆర్టీసీ సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఆలయం తృతీయ వార్షికోత్సవం

శామీర్‌పేట, మే 10, ప్రభాతవార్త : తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని దొంగల మైసమ్మ ఆలయం తృతీయ వార్షికోత్సవం సందర్భంగ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీలోని దొంగలమైసమ్మ ఆలయంలో ఆ గ్రామ మాజీ సర్పంచ బి.దయాసాగర్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి హరివర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు పి.శ్రీని వాస్ రెడ్డి, పలువురు నాయకులు జైపాల్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, మురళిగౌడ్, భక్తు లు, నాయకులు పాల్గొన్నారు.

## కల్లుగీత సంఘం పోరాటం ఫలితంగా గీత కార్పొరేషన్ ఏర్పడింది

### కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వి.రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు


పల్లెరవికుమార్‌గౌడ్‌కు తాటి బెల్లంను అందిస్తున్న ఎంవి.రమణ తదితరులు

చిక్కడపల్లి, మే 10 ప్రభాతవార్త: తెలంగాణ కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలను స్వీకరించిన పల్లె రవికుమార్‌గౌడ్‌ను కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వి.రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లా రత్నవరం నుంచి ప్రత్యేకంగా తయారు చేసిన తాటిబెల్లంను అందించారు. ఎంవి.రమణ మాట్లాడుతూ కల్లుగీత సంఘం పోరాటం ఫలితంగా 1991లో కార్పొరేషన్ ఏర్పడిందని, కార్పొరేషన్ లక్ష్యం గీత కార్మికులను ఆర్థికంగా అభివృద్ధి చేయడం, మారుతున్న పరిస్థితులు అనుగుణంగా నూతన సాంకేతికత ద్వారా వృత్తిలో మార్పులు తీసుకురావడం అని అన్నారు. నూతన చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ ప్రభుత్వం నుంచి తగిన బడ్జెట్ తీసుకువచ్చి ఈ లక్ష్యం నెరవేరే విధంగా కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఆఫీస్‌బేరర్లు వి.వెంకటనర్సయ్య, బొలగాని జయరాములు, పి.అచ్చాలు, గౌని వెంకన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు బోయపల్లి సుధాకర్‌గౌడ్, లచ్చాగౌడ్ తందరాములు, సోషల్‌మీడియా కన్వీనర్ ఎస్.రాజేష్, ఆంజనేయులు, మళ్ళగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE HON'BLE V SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT : HYDERABAD**
**I.A. No. 18 OF 2023**
**IN**
**O.S. No.1558 of 2014**

Between:
**Rampalli Naresh** ...Plaintiff
AND
**Rampalli Suresh and others** ...Defendants

To,
1. **Smt. Manga @ Mangama** D/o Late R.V. Ramesh, Aged: 50 years, Occ: Household, R/o 16-1-427/15, Second Floor, Yekalavya Nagar, Beside Firdous Bakery, Saidabad, Hyderabad-500059.
2. **Smt. Sunitha** D/o Late R.V. Ramesh, Aged: 48 years, Occ: Household, R/o 1-7-629/106/1/A, Hari Nagar, Ram Nagar, Hyderabad.
3. **Smt. Anitha** D/o Late R.V. Ramesh, W/o Mahesh, Aged: 40 years, Occ: Household, R/o H.No.6-3-224, MGIH Colony, Near Gandi Maisamma, New Boiguda Road, Sec'bad-500080.
4. **Smt. Kavitha** D/o Late R.V. Ramesh, Aged: 38 years, Occ: Household, R/o Room No.9, Block-3, Vambhoy Colony, Mailardevpally, Rajivgruha Kalpa, Lakshmiguda, R.R.Dist-500077.

Please take notice that the above named Plaintiff has filed the above O.S.No.1558 of 2014 against R.Suresh for Partition and in the said suit filed I.A.No.18/2023 to impleaded all of you and the above case is posted to 02.06.2023 for your appearance kindly appear before the above court on the above said date at 10.30 A.M. by person or through a pleader failing which the Hon'ble court will decide the matter on merits.

//BY ORDER OF THE COURT//

**Sd/- M/S. A. CHANDRA SHEKAR**
**AJAY PAREKAR**
**VARUN KUMAR**
**SHASHIKANTH REDDY**
**Advocates & Associates**
# 14-10-151, Lower Dhoolpet, Hyderabad.
**Cell: 9391301466, 6303937822**
**Counsel For Plaintiff**

**IN THE COURT OF THE HON'BLE IIND SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT : HYDERABAD**
**O.S.No: 585 of 2016**

Between:
**State Bank of India, Rep.by Its Chief Manager** ...Plaintiff
And
**Kannegoni Anand & another** ...Defendants

To
**Sri. D. Sarathchand,**
S/o. Late Sreemanarayana,
R/o. 17-1-391/T/203, Saraswathi Nagar, Saidabad, Hyderabad-59
**...Defendant No.12**

Please take summons that the PLAINTIFF HAS FILED THE ABOVE SUIT AGAINST YOU FOR RECOVERY OF MONEY. Whereas in the said Suit, summons were sent to you through process of Court and through R.P.A.D, but could not be served upon you as the same were returned unserved. Therefore as per Orders of the Honourable Court, this notice is published, the said Suit stands posted on **08-06-2023** for your appearance in the said court at 10.30 A.M. and in case you do not appear either in person or through an Advocate, the said suit will be heard and decided in your absence setting you exparte.

(By Order Of The Court)

**P. HARI PRASAD**
**K. RAMANJANEYULU**
**ADVOCATES**
FLAT NO. B-401, MOGHAL MASKAN APARTMENT, OPP.ZP OFFICE, ANANDNAGAR COLONY, KAIRATAHABAD, HYDERABAD-04.

**IN THE COURT OF THE HON'BLE CHIEF JUDGE, CITY CIVIL COURT, HYDERABAD, AT : HYDERABAD**
**A.S.No. 184 OF 2022**

Between:-
**GADDAM BALAIAH PRITHVI RAJ** ...Appellant
AND
**GADDAM MUTHVA RAJ & Others** ...Respondents

To
1. **GADDAM MUTHVA RAJ S/O. LATE GADDAM BALAIAH,** Aged about: 73 years, Occ: Business (R1)
2. **GADDAM SWATHANTRA RAJ S/O. LATE GADDAM BALAIAH,** Aged about: 65 years, Occ: Retd. Employee (R2)
3. **SATYANARAYANA H/O. LATE GADDAM KISTAMMA, S/O. NARSIMHA,** Aged about: 77 years, Occ: Retd. Employee (R3)
4. **NARESH KUMAR S/O. SATYANARAYANA** Aged about: 51 years, Occ: Doctor (R4)
5. **SAREN KUMAR S/O. SATYANARAYANA** Aged about: 46 years, Occ: Advocate (R5)
6. **SMT. VIJAYA ANITHA D/O. SATYANARAYANA,** Aged about: 48 years, Occ: Housewife (R6)
7. **SMT. DEEPANJALI D/O. SATYANARAYANA** Aged about: 47 years, Occ: Housewife (R7)
8. **B. VENKATESH S/O. LATE B. SHYAMLAL** Aged about: 52 years, Occ: Business (R8)
9. **B. HARI BABU S/O. LATE B. SHYAMLAL** Aged about: 50 years, Occ: Business (R9)
10. **B. ANIL BABU S/O. LATE B. SHYAMLAL** Aged about: 46 years, Occ: Business (R10)
11. **B. PRAVEEN S/O. LATE B. SHYAMLAL** Aged about: 41 years, Occ: Business (R11)
12. **B. RADHIKA D/O. LATE B. SHYAMLAL** Aged about: 37 years, Occ: Household (R12)
13. **N. YADAMMA W/O. LATE N. NARAHARI** Aged about: 77 years, Occ: Household (R13)
14. **SMT. MEENA D/O. LATE B. NANDA KUMAR,** Aged about: 52 years, Occ: Household (R14)
15. **B. SHANTHI KUMAR S/O. LATE B. NANDA KUMAR,** Aged about: 49 years, Occ: Business (R15)
16. **B. VIJAY KUMAR S/O. LATE B. NANDA KUMAR,** Aged about: 47 years, Occ: Business (R16)
17. **B. ASHOK KUMAR S/O. LATE B. NANDA KUMAR,** Aged about: 46 years, Occ: Business (R17)
18. **B. RAJENDAR KUMAR S/O. LATE B. NANDA KUMAR,** Aged about: 43 years, Occ: Business (R18)
19. **B. SANJAY KUMAR S/O. LATE B. NANDA KUMAR,** Aged about: 41 years, Occ: Business (R19)
20. **G. YADAGIRI RAJ S/O. LATE MAHENDAR RAJ,** Aged about: 46 years, Occ: Business (R21)
21. **G. PREM RAJ S/O. LATE MAHENDAR RAJ** Aged about: 44 years, Occ: Business (R22)
22. **G. SURESH RAJ S/O. LATE MAHENDAR RAJ,** Aged about: 42 years, Occ: Business (R23)
23. **G. SANTOSH RAJ S/O. LATE MAHENDAR RAJ,** Aged about: 39 years, Occ: Business (R24)
24. **GADDAM LAXMI RAJ S/o. LATE GADDAM BALAIAH,** Aged about 63 Years, Occ: Business (R29)
25. **BHAGYAVATHI W/O. LATE VIJAY KUMAR** Aged about: 58 years Occ: Household (R31)
26. **SADA LAXMI W/O. KALASDARU KHEMCHAND,** Aged about: 56 years Occ: Household (R32)

All are R/o. H.No.12-2-619, Harijan Basti, Gudimalkapur, Mehdipatnam, Hyderabad
**Respondents No.1 to 19; 21 to 24; 29; 31 & 32**

**NOTICE**

Please take notice that the above named Appellant has filed the above Appeal Suit vide **A.S.No.184 of 2022** and the above Appeal Suit is posted on 20-06-2023 for your appearance. So, you are hereby directed to appear before the said Hon'ble Court on **20-06-2023 at 10.30 A.M.,** in person or through counsel, failing which the above matter will be heard and disposed off in accordance with law.

(BY ORDER OF THE COURT)

**I. NAGENDER RAO**
**Advocate (TS/259/1995)**
Flat No.104, 1st Floor, Om Chaitanya Samrudhi Apts, Sangam Road, Langer House, Hyderabad-500 008, T.S.
**Cell : 9949001407**
**Counsel for Appellant**


**VAARTHA CLASSIFIEDS**

**CHANGE OF NAME**

★ **I, KANTHAMMA NALADALA** W/o Madhava rao naladala residing at hno:4-12-684 dwara kamainagar vanasthali puram hyderabad telangana 500070 have Changed Name as **LAXMI KANTHAMMA NALADALA** for all purposes

(Ro.No.6163)

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.


తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ** GHMC

నిట్ నం & తేది: 03/DB/EE/ కూత్బుల్లాపూర్ సర్కిల్/GHMC/2023-24, తేది: 09.05.2023
పనిపేరు: వార్డు కార్యాలయం ఏర్పాటు. అంచనా విలువ రూ.లక్షలలో : 43.70. ప్రారంభ తేది మరియు సమయం : 10.05.2023 ఉ.11.00గం. బిడ్ల స్వీకరణకు చివరి తేది మరియు సమయం : 12.05.2023 మ.3.00గం. EE పేరు మరియు చిరునామా : ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 9701908887 హెడ్ డ్రాఫ్ట్స్‌మ్యాన్ సెల్ నెం. 7331189482. తదుపరి వివరములను ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కూత్బుల్లాపూర్ సర్కిల్-25, GHMC.
**DIPR.No.1466-PP/CL/Advt/1/2023-24 తేది: 10.05.2023**

తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ** GHMC

నిట్ నం: 09/GHMC/MPT/EE/2023-24, తేది: 09.05.2023
పనుల సంఖ్య: (05) పనులు. అంచనా విలువ : రూ. 34.40 లక్షలు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది, సమయం : 10.05.2023 ఉ.11.30గం. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ముగింపు తేది, సమయం: 15.05.2023 ఉ.11.00గం. ప్రైస్ బిడ్ తెరచు తేది, సమయం : 15.05.2023 ఉ.11.15గం. సంబంధిత అధికారి పేరు మరియు చిరునామా : E.E, GHMC, మూసాపేట్ సర్కిల్-23, సెల్ నెం. 9989930362. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మూసాపేట్ డివిజన్-23, GHMC.
**DIPR.No.1483-PP/CL/Advt/1/2023-24 తేది: 10.05.2023**

తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ** GHMC

ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండరు ప్రకటన
నిట్ నెం.07/EE-Div-29/SBZ/GHMC/2023-24, తేది: 09.05.2023 ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫాంపై ప్రచురింపబడినది. 1) పని పేరు: 4 సం. పనులు, GHMC, SBZ, సికింద్రాబాద్, డివిజన్-29లో అన్ని వార్డులలో వివిధ స్థానాల వద్ద నాలా భద్రత దృష్ట్యా బ్యారికేడింగ్ ఏర్పాటు మరియు నాలాకు మరమ్మతులు. అంచనా మొత్తం/ECV లక్షలలో: 35.00, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ, చివరి తేదీ, సమయం: 11.05.2023 సా.4.00 గం. నుండి 15.05.2023 సా.4.00 గం.వరకు. అధికారి పేరు, చిరునామా, సెల్ నెం: EE డివిజన్-29, GHMC, సికింద్రాబాద్ సెల్ నెం.9963550657. సంబంధిత అధికారి చిరునామా పైన పేర్కొన్నది. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ వద్ద https://www.tender.eprocurement.gov.inకు లాగింగ్ అయి చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-29, సికింద్రాబాద్, GHMC
**DIPR.No.1485-PP/CL/Advt/1/2023-24, తేది: 10.05.2023**




# భూ బకాసురుల దాహానికి చెరువులు సైతం కబ్జా....
## మాసాబ్ చెరువును కాపాడాలని స్థానికుల ఆవేదన

**తుర్కయాంజాల్, మే 10 ప్రభాతవార్త :** రాష్ట్రంలో భూబకాసురుల దాహానికి హద్దే లేకుండా పోతుంది. చెరువులను సైతం కబ్జా చేసేస్తున్నారు. తాజాగా రంగారెడ్డి జిల్లాలోని మున్సిపాలిటీలోని మాసబ్ చెరువును కబ్జా చేశారు. స్థానికులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన ప్రయోజనం శూన్యమే. తాజాగా మాసబ్ చెరువును ఓ రియల్టర్ కబ్జా చేశాడు. ఎఫ్.టి.ఎల్ పరిధిలో ఉన్న ఆ చెరువును.. రాత్రి సమయంలో గుట్టుచప్పుడుగా టిప్పర్లతో మట్టిని చెరువులో డంపు చేశాడు. ఇంత చేస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో చారిత్రాత్మక చెరువుగా ప్రసిద్ధి చెంది... తుర్కయంజాల్‌కు తలమానికమైన మాసబ్ చెరువు 320 ఎకరాల్లో విస్తీర్ణం విస్తరించి ఉంది. నిజాం కాలం నాటి ఈ చెరువు మన ప్రాంతంలోనే అతిపెద్ద చెరువు 506 ఎకరాల చెరువు అని చెప్పుకోవడమేతప్ప వాస్తవంగా చెరువుచుట్టూ ప్రాంతమంతా కబ్జాకు గురైంది. వర్షాలు లేక చెరువుల్లో నీళ్ల లేని సమయంలో కొందరు రియల్టర్లు కోట్ల రూపాయలు విలువ కలిగిన చెరువుల్లో లారీలతో మట్టి తీసుకొచ్చి రాత్రి వేళల్లో దొంగతనంగా చెరువులో ఎట్లా నింపుతారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎఫ్‌టిఎల్ హద్దురాళ్ళు లేకుండా చేసి మట్టి పోసి నింపడం చట్టరీత్యా నేరమని అన్నారు. చెరువులో నీరు ఉండగా మట్టితో పూడ్చడాన్ని ఖండిస్తున్నామన్నారు. సాగర్ హైవే రోడ్డు పక్కనే ఉన్న చెరువును మట్టితో నింపుతుంటే ఇరిగేషన్ అధికారులు, ఆర్డీవో, ఎమ్మార్వోలు ఎందుకు చర్యలు తీసుకోవడం లోదేని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడవలసిన కనీస బాద్యత అధికారులకు లేదా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కబ్జాలకు పాల్పడుతున్నవారిని చూసిచూడ నట్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎందుకు ఊరుకున్నారని ప్రశ్నిస్తున్నారు. వెంటనే శాటిలైట్ ద్వారా రీ సర్వే చేసి ఎఫ్‌టిఎల్ హద్దురాలు ఏర్పాటు చేసి మాసబ్ చెరువులో పోసిన మట్టిని ఎత్తివేయాలని, మట్టి పోసిన వారిపై ల్యాండ్ గ్రామింగ్ కేసులు పెట్టి అరెస్టు చేయాలని హెచ్చరించారు. ఈ చెరువు సుందరీకరణకు మంత్రి కేటీఆర్ గతంలో రూ. 2కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించారన్నారు. చెరువు అభివృద్ధికి కూడా నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారని వివరించారు. ఈ విషయంపై ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు, దృష్టి సారించి చెరువును రక్షించి, బాధ్యులను శిక్షించాలని.. లేకపోతే అఖిలపక్షంగా ఏర్పడి ఆందోళనకు దిగుతామని స్థానికులు హెచ్చరించారు.

## ప్రకాష్ అంబేడ్కర్ సహకారంతో హైదరాబాద్‌ను రెండో రాజధానిగా చేసేందుకు ఉద్యమిస్తాం


తార్నాకలో మాట్లాడుతున్న ప్రొ.గాలి వినోద్‌కుమార్

**తార్నాక, మే 10 ప్రభాతవార్త:** ప్రకాష్ అంబేద్కర్ సహకారంతో హైదరాబాద్‌ను రెండో రాజధానిగా చేసేందుకు ఉద్యమిస్తాం దక్షిణ భారత సమితి కన్వీనర్ ప్రొ.గాలి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం తార్నాకలోని ఓ.యూ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రొ.గాలి వినోద్ మాట్లాడుతూ మాజీ ఎంపి వంచిత బహుజన అగాడి జాతీయ అధ్యక్షులు ప్రకాశ్ అంబేడ్కర్ దేశ రాజధానిగా హైదరాబాద్‌ను ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామని ఆయనతో కలిసి పోరాడుతామన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో ఆయన ముందుకు వెళ్లడం పట్ల తాము హర్షం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ దేశరక్షణకు సమతుల్య వాతావరణానికి దేశ పరిశోధన రంగాలకు అత్యున్నత ప్రాంతం అన్నారు. ఉత్తరాది రాజధాని అయిన ఢిల్లీతో పోల్చుకుంటే అన్ని రంగాల్లో ముందజంలో ఉన్న నగరాన్ని దేశ రెండో రాజధానిగా చేయాడానికి బిజేపీ ప్రభుత్వానికి ఏమి అడ్డంకి అన్నారు. ఉత్తరాది పార్టీలైన కాంగ్రెస్, బీఎస్పీ, ఎస్పీ, ఆర్జేడీలు హైదరాబాద్ దేశ రెండవ రాజధాని అంశంపై ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వంచిత బహుజన సమాఖ్య తెలంగాణ రాష్ట్ర శాఖ కోఆర్డీనేటర్లు ఉమ్మడి ఆనంద్, డా.బండి విజయ్‌కుమార్, తెలంగాణ హైకోర్టు న్యాయవాది గాలి చంద్రకళ, సంతోష్, శేర్‌లింగం పల్లి నాయకురాలు ఎం.నిర్మల, విధ్యార్థి నాయకులు, రాహుల్ ముదనూరి తధితరులు పాల్గొన్నారు.

## నూతనంగా నిర్మించిన నేడు ఐఎస్ సదన్, సైదాబాద్ పోలీస్ ఠాణాల ప్రారంభం


సైదాబాద్ పోలీస్ స్టేషన్ భవనం

**సైదాబాద్, మే 10 ప్రభాతవార్త:** నూతనంగా నిరి ్మంచిన సైదాబాద్, ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్ల భవనాలను గురువారం హోంమంత్రి మహమూద్ అలీ ప్రారంభించనున్నారు. నూతన పోలీస్ స్టేషన్ల ఏర్పాటులో భాగంగా ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్‌ను కొత్తగా ఏర్పాటు చేస్తున్నారు. సంతోష్‌నగర్ పోలీస్ స్టేసన్ కోసం నిరి ్మంచిన నూతన భవనంలో కొత్తగా ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు కానుంది. రెండు పోలీస్ స్టేషన్లు కొత్తగా ఏర్పాటైన సౌత్ ఈస్ట్ జోన్ డిసిపి పరిధిలోకి రానున్నాయి. సంతోష్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను మరో చోటుకు తరలించనున్నారు. నూతనంగా ఏర్పాటవుతున్న ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి ఐఎస్ సదన్ డివిజన్, చంపాపేట డివిజన్, సంతోష్‌నగర్ డివిజన్లకు చెందిన కొంత భాగాలు రానున్నట్లు తెలుస్తుంది. మాదన్నపేట, కాంచన్‌బాగ్, సైదాబాద్ పోలీస్ స్టేషన్ల పరిధుల్లో కూడా మార్పులు రానున్నట్లు పోలీసు అధికారులు పేర్కొంటున్నారు.

## జలమండలి జిఎంను బదిలీ చేయాలి : కార్పొరేటర్ లచ్చిరెడ్డి


కాలనీవాసులతో కలిసి ధర్నా నిర్వహిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం, మే 10 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించాలని జలమండలి జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్‌ను వెంటనే బదిలీ చేయాలని బిఎన్‌రెడ్డినగర్‌డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి డిమాండ్‌చేశారు. వనస్థలి పురం జలమండలి జిఎం కార్యాలయంవద్ద వివిధ కాలనీవాసులతో కలిసి లచ్చిరెడ్డి బుధవారం ధర్నా నిర్వహించారు. డివిజన్‌లోని డ్రైనేజీ సమస్య గురించి కాలనీవాసులు పలుమార్లు ఫిర్యాదు చేసిన జిఎం పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా గౌతమి నగర్‌లో డ్రైనేజీ పనులు సంవత్సరమైన ప్రారంభించలేదని దీంతో అక్కడి ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. అదే విధంగా ఎన్జీవోస్‌కాలనీ, విజయపురి కాలనీలలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించడంలో జలమండలి అధికారులు విఫలమయ్యారని డ్రైనేజీ పనులు మొదలు పెట్టేవరకు ఇక్కడినుండి కదిలేది లేదని భీషి ంచుకున్నారు. అందుకు స్పందించిన జిఎం వినోద్‌కుమార్ గౌతమినగర్ పనులు ప్రారంభమయ్యాయని, వారంలో పూర్తి చేస్తామన్నారు. ఎన్జీవోస్ కాలనీలో శుక్రవారం పనులు ప్రారంభిస్తామని జిఎం లిఖితపూర్వకంగా తెలుపడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులతోపాటు నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, ముదుపు సందీప్‌రెడ్డి, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## స్కేటింగ్ క్రీడా మైదానాన్ని ఇండోర్ స్టేడియంగా తీర్చిదిద్దుతా : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


ఇండియా టీంకు ఎంపికైన క్రీడాకారులతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**వనస్థలిపురం, మే 10 ప్రభాతవార్త:** వనస్థలిపురంలోని ఎ టైప్ క్వార్టర్స్‌లోగల స్కేటింగ్ మైదానాన్ని ఇండోర్ స్టేడియంగా తీర్చిదిద్దుతామని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ స్పోర్ట్స్ అసోసియేషన్ రంగారెడ్డిజిల్లా ఆధ్వర్యంలో కోచ్‌లు సత్యం, శ్రీనివాస్‌ల పర్యవేక్షణలో 5గురు బాలబాలికలు రోలర్ అండ్ ఇన్‌లైన్ హాకీ ఆట ఆడడానికి ఇండియా టీంలో సెలెక్టయ్యారని ఈసందర్బంగా వనస్థలిపురం స్కేటింగ్ క్రీడా మైదానంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో హాకీఆటకు ఎంపికైన శ్రీమాన్,నందిత, శ్రీపతి, తన్మయి, సాయిచంద్రలను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అభినందించారు. క్రీడ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో చేయూతనిస్తుందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించి క్రీడలలో బంగారు పథకాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్‌అధ్యక్షుడు టంగుటూరి నాగరాజు, మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, డివిజన్ బిఆర్‌ఎస్ అధ్యక్షుడు చింతల రవికుమార్, అనంతుల రాజిరెడ్డి, ఆనంద్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## వాగ్దేవి ఉత్తమ విద్యార్థులకు చైర్మన్ అభినందనలు


ర్యాంకర్లను అభినందిస్తున్న చైర్మన్ సిద్దాల బీరప్ప

**సరూర్‌నగర్, మే 10 ప్రభాతవార్త:** ఇంటర్మీడియట్ ఫలితాల్లో విజయ దుందుభి మ్రోగించిన బాలాపూర్ మండలంలోని వాగ్దేవి జూనియర్ కాలేజీ విద్యార్థులను చైర్మన్ సిద్దాల బీరప్ప అభినందించారు. ద్వితీయ సంవత్సరం ఇంటర్ ఫలితాల్లో ఈ కాలేజీకి చెందిన ఎంపిసి విద్యార్థులు వి.స్నేహ వెయ్యి మార్కులకు గాను 989 మార్కులు, బి.నిహారిక 982 మార్కులు సాధించారు. అదే విధంగా మొదటి సంవత్సరం ఫలితాల్లో కూడా విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. ఈ నేపథ్యంలో చైర్మన్ బీరప్ప విద్యార్థులకు పుష్ప గుచ్ఛాలను అందజేసి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బి.శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు రవికుమార్, నర్సింహారెడ్డి, ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర కీలకం



వరుణ్‌కుమార్‌ను అభినందిస్తున్న రాధాకృష్ణ

**హయత్‌నగర్, మే 10 ప్రభాతవార్త:** 10వ తరగతి పరీక్షా ఫలితాలలో హయత్ నగర్ ముదిరాజ్ బస్తీకి చెందిన శ్రీరామ్ యాదయ్య కుమారుడు వరుణ్ కుమార్ 10/10 జీపీఏ సాధించాడు. వరుణ్ శాంతినికేతన్ ఉన్నత పాఠశాలలో చదువుతున్నాడు. 10/10 సాధించిన వరుణ్‌కుమార్‌కు శాంతినికేతన్ విద్యా సంస్థల చైర్మన్ రాధాకృష్ణ బుధవారం సాయంత్రం పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల ఉత్తమ ఫలితాలు సాధించడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లి దండ్రుల పాత్ర ఎనలేనిదన్నారు. విద్యార్థుల చదువుల్లో డబ్బు కంటే వారితో పాటు కుటుంబ సభ్యుల కృషి, పట్టుదల కీలకమన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్లు శేషారావు, ఝాన్సీ, ఇంఛార్జీ సుధీర్ పాల్గొన్నారు.

## జిల్లెలగూడ శ్రీవారి ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

**సరూర్‌నగర్, మే 10 ప్రభాతవార్త:** ఉత్తర ద్వారం ఉన్న అరుదైన జిల్లెలగూడ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం శ్రీవారి హుండీ ఆదాయం లెక్కింపు జరిగింది. ఇటీవల స్వామి వారి బ్రహ్మోత్సవాలు ముగిసిన నేపథ్యంలో గత మార్చి నెల నుండి మే పదవ తేదీ వరకు వచ్చిన హుండీ ఆదాయాన్ని బుధవారం ఉదయం ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ ట్రస్టీ చైర్మన్ రాజా సంజయ్ సైంచర్ గోపాల్ ఆధ్వర్యంలో ఆలయ ఇఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎండోమెంట్ తరపున ఇచ్చిన పరిశీలక ఇఓ మురళీకృష్ణ, స్థానిక కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి, ఆలయ మాజీ డైరెక్టర్ పోరెడ్డి జంగారెడి, అర్చకులు, భక్తుల సమక్షంలో హుండీలను తెరిచి లెక్కింపు జరిపారు. ఈ మేరకు ఆలయ హుండీ ఆదాయం మొత్తం రూ.68,360 వచ్చింది. ఈ మొత్తాన్ని ఇఓ స్థానిక ఎస్‌బిఐ బ్యాంకులో ఆలయ ఖాతాలో జమ చేయించారు.

## పదవ తరగతి పరీక్షల్లో బ్రిలియంట్ ప్రభంజనం : ఎమ్మెల్సీ నారాయణరెడ్డి


విద్యార్థులను అభినందిస్తున్న బ్రిలియంట్ చైర్మన్ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి

**మలక్‌పేట, మే 10 ప్రభాతవార్త:** 10వ తరగతి పరీక్షా ఫలితాలలో బ్రిలియంట్ గ్రామర్ స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని బ్రిలియంట్ విద్యా సంస్థల చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. దిల్‌సుక్‌నగర్‌లోని బ్రిలియంట్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో 10వ తరగతి పరీక్షా ఫలితాలలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆయన పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొత్తం 1890 మంది విద్యార్థులు హారు కాగా 1871 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. 117 మంది 10 జిపిఎ, 612 మంది ఎ1 గ్రేడ్, 408 మంది విద్యార్థులు ఎ2 సాధించారన్నారు. అదేవిధంగా అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ఉన్నత స్థాయిలో నిలవాలని ఆకాంక్ష వ్యక్తం చేసారు. తమ పాఠశాలలో 99 శాతం ఉత్తీర్ణత సాధించారని ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రసాదరావు, ప్రిన్సిపల్ వేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులను పరిశీలించిన మేయర్

**సరూర్‌నగర్, మే 10 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 9వ డివిజన్‌లో జరుగుతున్న సిసి రోడ్డు నిర్మాణపు పనులను బుధవారం మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పర్యవేక్షించారు. డివిజన్‌లోని ఎంవిఎస్ఆర్ కాలేజీ సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న రోడ్డు పనులను ఆమె పరిశీలించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నిమ్మల శ్రీకాంత్‌గౌడ్, ఏనుగు రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో 80.80% హయత్‌నగర్ మండలంలో 76.58% ఉత్తీర్ణత

**హయత్‌నగర్, మే 10 ప్రభాతవార్త:** 10వ తరగతి పరీక్షా ఫలితాలలో హయత్‌నగర్ మండలానికి సంబంధించి మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు 97.10 శాతం ఉత్తీర్ణత సాధించి మొదటి స్థానంలో నిలవగా... హయత్‌నగర్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు 62.89 శాతం ఉత్తీర్ణతతో చివరి స్థానంలో నిలిచారు. హయత్‌నగర్ మండలానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 602 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా... 76.58 శాతంతో 461మంది ఉత్తీర్ణత సాధించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలానికి సంబంధించి మొత్తం 802 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 80.80 శాతంతో 648 మంది ఉత్తీర్ణత సాధించారు. కవాడిపల్లి, బండరావిరాల పాఠశాలల్లో 100 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా... జడ్పీహెచ్‌ఎస్ పెద్దఅంబర్‌పేట 54.24 శాతంతో మండలంలో చివరి స్థానంలో నిలిచింది. జడ్పీహెచ్‌ఎస్ తొర్రూర్ విద్యార్థి సయ్యద్ గౌస్‌పాషా ఒక్కడే మండలంలో 10/10 జీపీఏ సాధించడం విశేషం.

## బ్రాహ్మణ భవనానికి స్థలం కేటాయించిన మంత్రి సబితాఇంద్రారెడ్డికి కృతజ్ఞతలు

**సరూర్‌నగర్, మే 10 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని బ్రాహ్మణ కుటుంబాలకోసం బ్రాహ్మణ భవనం నిర్మాణ నిమిత్తం బాలాపూర్ మండలం లోని కుర్మల్‌గూడలో సర్వే నెంబర్ 370లో వెయ్యి గజాల స్థలాన్ని కేటాయిం చిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డికి బ్రాహ్మణ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు బుధవారం మహేశ్వరం నియోజకవర్గ బ్రాహ్మణ సంఘాల జెఎసి చైర్మన్, శ్రీ వేద గాయత్రి సేవా ట్రస్ట్ చైర్మన్ మంగు రాఘవరావు, బ్రాహ్మణ సంఘం నాయకుడు కుటార్ ప్రమోద్ తదితరులు మంత్రి చేతులమీదుగా స్థలానికి సంబంధించిన పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ బ్రాహ్మణ కుటుంబాల తరపున మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మురుకుంట్ల అరవింద్ శర్మ, రామిడి రాంరెడ్డి, సంరెడ్డి వెంకట్‌రెడ్డి, భీమిడి జంగారెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## దివాల్ లేఖన్ అభియాన్ సందర్భంగా గోడలపై కమలం గుర్తులు..

**నేరెడ్‌మెట్, మే 10 ప్రభాతవార్త:** దేశ,రాష్ట్ర ప్రజలు బీజెపి ప్రభుత్వ హయంలోనే అభివృద్ధి చెందుతున్నారని వినాయక్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన దివార్ లేఖన్ అభియాన్ కార్యక్రమంలో అమె పాల్గొని గోడలపై బీజెపి కమలంపువ్వు గుర్తును వేయించారు. అనంతరం అమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మల్కాజిగిరి నియోజకవర్గంలో బీజెపి పార్టీ గెలుపు ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో 174 పోలింగ్ బూత్ అధ్యక్షులు, బీజెవైయం జిల్లా కార్యదర్శి అవుల సంతోష్, దొమ్మటి సంతోష్, ఓబిసి రాష కన్వీనర్ మణిరత్నం, జిలెల్ల భరత్ యాదవ్, అకారం సాయిరామ్, వెంకట్ యాదవ్, సంతోష్ గుప్తా, రవి, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన : కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, మే 10 ప్రభాతవార్త:** మూసారాంబాగ్ డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్‌లోని శాలివాహననగర్‌లో రూ. 30 లక్షలో నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో వేగవంతంగా పలు అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, సూపర్‌వైజర్, కాలనీవాసులు చందు, పున్‌రెడ్డి కృష్ణారెడ్డి, సందీప్, సంతోష్, శంకర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో భాష్యం విద్యార్థుల విజయకేతనం


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ పల్లవి, భానుమతిలు

**మలక్‌పేట, మే 10 ప్రభాతవార్త:** 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో దిల్‌సుక్‌నగర్ భాష్యం విద్యార్థులు విజయకేతనం ఎగరవేసారని ప్రిన్సిపల్ పల్లవి పేర్కొన్నారు. భాష్యం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో 10వ తరగతి పరీక్షా ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆమె పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 5గురు విద్యార్థులు 10జిపిఎ, 11మంది 9.8 జిపిఎ, 9మంది 9.7 జిపిఎ, 61 మందికి 9 జిపిఎ సాధించారని వివరించారు. ఈ సందర ్భగా భాష్యం జడ్ఇఓ అంకమ్మరావు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అందుకోవాలని వ్యక్తం చేసారు. ఉత్తమ ఉపాధ్యాయ బృందంతో అధునాతన పద్దతిలో విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధిస్తూ వారిలో ఉన్న సృతజనాత్మకతను వెలికితీయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లిటిల్ చాంప్స్ ప్రిన్సిపల్ భానుమతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిఓ 118 పై ఎలాంటి అపోహలు, అనుమానాలు వద్దు : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


కన్వీయన్స్ డీడ్ అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, తహశీల్దార్లు,సబ్‌రిజిస్ట్రార్లు

**సైదాబాద్, మే 10 ప్రభాతవార్త:** జిఓ 118 గురించి ఎలాంటి అపోహలు, అనుమానాలు అవసరం లేదని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఎల్‌బినగర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన బాధితులు, ఎమ్మార్వోలు, సబ్‌రిజిస్ట్రార్‌లతో కలిసి బుధవారం కర్మన్‌ఘాట్‌లో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చివరి ఇంటి వరకు జిఓ 118 ఫలాన్ని అందించడం జరుగుతుందని, ఎవరు ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. జిఓ 118 ద్వారా కన్వీయన్స్ డీడ్ పొందిన వారికి ఆ స్థలంపై పూర్తి యాజమాన్య హక్కులు పొందుతారని దీనిలో ఎలాంటి సందేహానికి తావులేదన్నారు. కన్వీయన్స్ డీడ్ పొందిన వారికి 22/ఎ ఉపసంహరించడినట్లుగా గుర్తించాలన్నారు. ప్లాటు నంబరు, సరిహద్దులు వంటి వాటిలో ఏమైనా పొరబాట్లు జరిగి ఉంటే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సరి చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఖాళీ స్థలాలను క్రమబద్ధీకరించడానికి జిఓ 118 ద్వారా వీలుకాదన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. జిఓ 118కు చివరి తేదీ అంటూ ఏమీ లేదన్నారు. మొదటగా చలానా చెల్లించి ఎమ్మార్వో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కాగా జిఓ 118 విషయంలో పలువురు కాలనీవాసులు అడిగిన సందేహాలను సరూర్‌నగర్ తహశీల్దార్ జయశ్రీ, హయత్‌నగర్ తహశీల్దార్ సంధ్యారాణి, ఉప్పల్ తహశీల్దార్ గౌతమ్‌లు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం సబ్‌రిజిస్ట్రార్ మోహన్, చంపాపేట సబ్‌రిజిస్ట్రార్ మధుసూధన్‌రెడ్డి, సరూర్‌నగర్ సబ్‌రిజిస్ట్రార్ జహంగీర్, ఎల్‌బినగర్ సబ్ రిజిస్ట్రార్ రవి కిరణ్, ఉప్పల్ సబ్‌రిజిస్ట్రార్ సోనిలు పాల్గొన్నారు.

## ఉత్తమ మార్కులు సాధించిన లాలాపేట్ ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థులు

**తార్నాక, మే 10 ప్రభాతవార్త :** పదవతరగతి పరీక్షలో మారెడ్‌పల్లి మండలం పరిధిలోని లాలాపేట్ మార్కెట్ ప్రభుత్వబాలికల పాఠశాల విద్యార్థులు మంచి మార్కులు సాధించారు. గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 93శాతం విద్యార్థులు పాస్ అయ్యారు. 40మంది విద్యార్థుల్లో 37 మంది విద్యార్థినులు పాసయ్యారు. వీరితో పాటు అత్యుత్తమ మార్కులు సాధించిన వారిలో ఎస్.దుర్గ 8.8, పి.కావ్య 8.7, ఎం.ఐశ్వర్య 8.2, యూ.భాను 8.0, ఎం.పూర్ణిమా 8.0 సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు సరళ పేర్కొన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులకు స్కూల్ ఎడ్యూకేషన్ కమిటీ చైర్మన్ ఎం.ప్రకాష్ అభినందించారు. విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించేందుకు కృషి చేసిన టీచర్లకు ఆయన కృతజ్ఞతలు చెప్పారు.

## స్త్రీలు అన్ని రంగాలలో రాణించాలి : మంత్రి


మాస్టర్ మైండ్స్ విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి తలసాని

**మలక్‌పేట, మే 10 ప్రభాతవార్త:** స్త్రీలు అన్ని రంగాల్లో రాణించాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. సీనియర్ ఇంటర్ ఎంఇసి ఫలితాలలో టాప్ మార్కులు సాధించిన దిల్‌సుక్‌నగర్ మాస్టర్ మైండ్స్ ఫలితాలలో టాప్ మార్కులు సాధించిన విద్యార్థులు కె.అజయ్, టి.హాసిని, డి.సఫిఆ తహశీన్, డి.ముక్తేశ్వర్‌లను మంత్రి తలసాని పుష్పగుచ్ఛాలను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీలు ముఖ్యంగా విద్యారంగంలో చక్కగా రాణించాలంటే వారికి సరైన మార్గదర్శకం కావాలని దానికి అనుగుణంగా మంచి నైతిక విలువలతో కూడిన ఫ్యాకల్టీ కలిగిన విద్యాసంస్థలను ఎంచుకుని మన లక్ష్యాలను సాధించి తద్వారా మనం జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోగలమని విద్యార్థులకు సూచించారు. అనంతరం జోనల్ అడ్మిన్ ఇంఛార్జిలు ఎస్.వెంకటేశ్వరరావు, ఎస్ఎం.వలి, ప్రిన్సిపల్ అంజనేయరెడ్డిలు మాట్లాడుతూ ప్రణాళికబద్దంగా విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధిస్తున్నామని, వారి భవిష్యత్తును తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

## 10వ తరగతి పరీక్షా ఫలితాలలో శాంతినికేతన్, శ్రీ ఆదిత్య లయోల, పాఠశాలల జయకేతనం


విద్యార్థులను అభినందిస్తున్న శ్రీ ఆదిత్య చైర్మన్ కెఎస్‌వి సుధాకర్

**వనస్థలిపురం, మే 10 ప్రభాతవార్త:** 10వ తరగతి ఫలితాలలో వనస్థలిపురంలో వివిధ పాఠశాలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారు. వనస్థలిపురంని శాంతినికేతన్ విద్యా సంస్థల విద్యార్థులు 14 మంది 10కి 10 జిపిఎ సాధించారు. 15 మంది విద్యార్థులు 10కి 9.8 జిపిఎ సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్ జి.రాధాకృష్ణ తెలిపారు. ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలను సాధించేదిశగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దుతున్నారన్నారు. భవిష్యత్తులో ఎలాంటి పోటీపరీక్షలనైనా ఎదుర్కొనే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు జి.ఝాన్సీరాధాకృష్ణ, జి.శేషారావు, జోనల్ ఇంఛార్జి జి.సుధీర్, డీన్ ఎ. ఫణిశ్రీప్రభంజన్ తదితరులు పాల్గొన్నారు.

**లయోలా విద్యా సంస్థలలో...** వనస్థలిపురం లయోలా మోడల్ హైస్కూల్ 10వ తరగతి పరీక్షా ఫలితాలలో ఉత్తమ ఫలితాలను సాధించారు. 6గురు విద్యార్థులు 10కి 10జిపిఎ సాధించారు. 13 మందికి 10 మంది 9.8 జిపిఎ సాధించినట్లు విద్యా సంస్థల చైర్మన్ రంగినేని వెంకటేశ్వరరావు తెలిపారు. భార్గవ్ ఆనంద్, సి.హెచ్.శివ, కే.శ్రీకర్, సి.హెచ్.శ్రీవర్ష, మోక్షప్రదాయనిలు 10కి 10పాయింట్లు సాధించారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల చైర్మన్ వెంకట్‌రావు విద్యార్థులను అభినందించారు.

**శ్రీ ఆదిత్య ఐఐటి కాన్సెప్ట్ స్కూల్‌లో...** 10వ తరగతి ఫలితాలలో వనస్థలిపురంలోని హిల్‌కాలనీలోగల శ్రీ ఆదిత్య పాఠశాల విద్యార్థులు విజయకేతనం ఎగరవేసారు. మునగాల దినేష్, కె.కోమల్, పి.సిద్ధార్థ్‌రెడ్డిలు 10కి 10 గ్రేడ్ పాయింట్లు సాధించి పాఠశాల ప్రథమస్థానంలో నిలిచినట్లు చైర్మన్ డాక్టర్ కెఎస్‌వి సుధాకర్ తెలిపారు. మొత్తం 48 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 47 మంది ఉత్తీర్ణత సాధించారు. మణిదీప్, సాయిమనస్వి, సాద్వికలు 9.8గ్రేడ్ పాయింట్లు సాధించి పాఠశాల ద్వితీయస్థానంలో నిలిచారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సరిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.